విశాఖపట్టణం
గురువారం 27 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 215 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## అసెంబ్లీకి అద్భుత డిజైన్‌లు

భవనం పైభాగంలో టవర్

రాజధాని మొత్తం వీక్షించొచ్చు

సందర్శకుల కోసం ఎక్స్ పీరియన్స్ సెంటర్

అందరూ సమావేశమయ్యేలా సెంట్రల్ హాల్

మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



3



### ఎల్ నినోపై ముందస్తు

## ప్రణాళిక ఏదీ..?

### కరవు కాటేస్తున్నా పట్టించుకోరా

రైతాంగాన్ని ఆదుకునే ఉద్దేశ్యమే లేదా

ఒక్క రైతుకైనా విత్తనాలు పంపిణీ చేసారా

రెడ్ బుక్ అమలులో బిజీగా ఉన్నారు

బీసీలకు రిజర్వేషన్లు చాంపియన్లు మేమే

బాబు హయాంలో బీసీల బతుకు బుగ్గు పాలు

వైఎస్సార్ సీపీ అధినేత జగన్ ధ్వజం

**(తాడేపల్లి - జయజయహే)**

దారుణమైన పాలన సాగుతోందని, రైతులను, ఇతర వర్గాలను ఆదుకోవాలనే ఆలోచన ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేదని వైఎస్ జగన్ ఆరోపించారు. తాడేపల్లిలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్లలో రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నామని, బీసీలకు మేలు చేశామని ..మిగతా 2లో


# జనవరి 1 నుంచి సంజీవని

ఆరోగ్య సేవలకు డిజిటల్ హెల్త్

స్క్రీనింగ్.. చికిత్స.. ఫాలో అప్

ఏఐ ఆధారిత వైద్య సేవలకు శ్రీకారం





**(అమరావతి - జయజయహే)**

వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన సంజీవని ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో సంజీవని ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు చంద్రబాబు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు.

సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. 'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, ..మిగతా 2లో

# దశాబ్దాల కల సాకారమయ్యే వేళ..!



ఎట్టేకలకు విశాఖ గోదావరి నీరు

పోలవరం ఎడమకాలువ ద్వారా తరలింపు

సెప్టెంబర్ 3న సీఎం చంద్రబాబు జలహారతి

పాయకరావుపేట సీతారాంపురానికి నీరు

**(అనకాపల్లి - జయజయహే)**

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా, గోదావరి జలాలు ఎడమ కాలువ ద్వారా తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు ప్రవహించనున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మురారి, మల్లేపల్లి, బూరుగుపూడి, ప్రత్తిపాడు, చెందుర్తి, కత్తిపూడి, బెండపూడి, ఆరెంపూడి, గవరయ్య కోనేరుల వద్ద జాతీయ రహదారి దాటనుంది. ఆరెంపూడి, బెండపూడి వద్ద వంతెనలు, ఓ వైపు 500 మీటర్ల చొప్పున 1,000 మీటర్ల అప్రోచ్ నిర్మాణం ..మిగతా 3లో

# రైల్వే మెగా ప్లాన్..!


హై-డెన్సిటీ రూట్‌లలో ఫోర్ లైన్లు

ఏడు కీలక మార్గాలపై ఫోకస్

రూ. 4.2 లక్షలకోట్లకు పైగా ఖర్చు

కేంద్ర ప్రభుత్వం కీలక ప్రణాళిక

2



## గల్లంతైన మత్స్యకారులు క్షేమం

23 రోజుల తర్వాత ఆచూకీ లభ్యం

పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితం

**(కోనసీమ - జయజయహే)**

ఆగస్టు 3న చేపలవేటకు వెళ్లి అదృశ్యమైన మత్స్యకారుల ఆచూకీ దొరికింది. కోనసీమకు చెందిన అదృశ్యమైన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ సముద్ర తీర ప్రాంతంలో సురక్షితంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సముద్రంలో వీరు గల్లంతయ్యారని వచ్చిన వార్తలతో కోనసీమ జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై రంగంలోకి దిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్ నేరుగా ఈ వ్యవహారాన్ని పర్యవేక్షిస్తూ వచ్చారు. వేగవంతమైన చర్యలు చేపట్టడంతో ఆ ఏడుగురు మత్స్యకారులు బెంగాల్ కోస్ట్ తీరంలో క్షేమంగా ఉన్నారని బోటును ..మిగతా 3లో



### ప్రియుడు కారుపై లవర్

# 3,400 ముద్దులు

ఇన్ స్టాలో 24 గంటల్లో 55 లక్షల వ్యూస్

రూ.5,500 జరిమానా విధించిన పోలీసులు

గ్వాలియర్‌లో ఓ జంట నిర్వాకం వైరల్

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

సోషల్ మీడియాలో వైరల్ కావాలనే ప్రయత్నంలో కొందరు వింత వింత పనులు చేస్తుంటారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోనూ ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. ఓ యువకుడి గర్ల్‌ఫ్రెండ్ అతడి కారును ఏకంగా కిస్సింగ్ కార్‌గా మార్చేసింది. కారు మొత్తం లిప్‌స్టిక్‌తో ముద్దుల గుర్తులు వేసింది. ఒక్కటీ రెండూ కాదు, దాదాపు 3,400 ముద్దుల గుర్తులతో కారును ..మిగతా 3లో





2

## చికెన్.. డౌన్..!

ధరలు భారీగా తగ్గుముఖం.. కిలో రూ. 240కే

కోడిగడ్డు ధర కిందకే... డజన్ రూ. 75కే లభ్యం

పెరిగిన సరఫరా.. తగ్గిన డిమాండ్

### కూటమి ప్రభుత్వానికి

## వైఎస్సార్‌సీపీ సవాళ్లు:

ఏపీలో రాజుకుంటున్న ప్రతిపక్ష జ్వాల

**(విజయవాడ జయ జయహే )**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ప్రస్తుతం ఉద్యమాల వేదికగా మారుతున్నాయి. 2024 ఎన్నికల తరువాత ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) రాష్ట్రంలో అధికార కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉధృతమైన పోరాట వ్యూహాన్ని అమలు చేస్తోంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ఉత్తరాంధ్ర పర్యటనకు ప్రజల నుంచి లభించిన అపూర్వ స్పందన నేపథ్యంలో, పార్టీ ఈ దూకుడును మరింత పెంచింది. ఆంధ్రప్రదేశ్‌లో ..మిగతా 3లో



For a pure tomorrow.. జయహో

# ఎల్ నినోపై ముందస్తు ప్రణాళిక ఏదీ..?

మొదటి పేజీ తరువాయి...



వెల్లడించారు. బీసీలు, రైతులు, మాదకద్రవ్యాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. రెడ్‌బుక్ అమలులో బిజీగా ఉన్న చంద్రబాబు కరవు పరిస్థితులను పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మాఫియా పాలన నడుస్తోందని అన్ని రంగాల్లో దోపిడీ మాత్రమే సాగుతోందని, ప్రశ్నించే వారిపై వేధింపులు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

"ఇవాళ రాష్ట్రాన్ని కరువు కాటేస్తున్నా చంద్రబాబు కళ్లు తెరవడంలేదు. రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం లోటు మైనస్ - 52 శాతం ఉంది. కోస్తాంధ్రలో మైనస్ - 47 శాతం, రాయలసీమలో మైనస్ - 52శాతం వర్షపాతం లోటు కనిపిస్తోంది. ఏ జిల్లా చూసినా లోటు వర్షపాతమే. కాని ఈ వెన్నుపోటు పార్టీ నాయకుడు మాత్రం కుంభకర్ణుడిని తలపిస్తూ నిద్రలేవడంలేదు. జూన్ నుంచి ఆగస్టు 23 వరకూ సాధారణ వర్షపాతం 384 మిల్లీమీటర్ల పడాల్సి ఉండగా, ఇప్పటివరకూ పడింది కేవలం 189.62 మిల్లీమీటర్లు మాత్రమే. అదికూడా పడాల్సిన రోజుల్లో పడలేదు. "డ్రైస్పెల్స్" వచ్చాయి. రాష్ట్రంలో 688 మండలాలు ఉంటే, అందులో 625 మండలాల్లో లోటు వర్షపాతమే ఉంది. అంటే 91శాతం రాష్ట్రం లోటు వర్షపాతాన్నే ఎదుర్కొంటోంది. 434 మండలాల్లో లోటు వర్షపాతం ఉంటే, మరో 191 మండలాల్లో ఈ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. ఇక జిల్లాల పరంగా చూస్తే 28 జిల్లాలకు గానూ 25 జిల్లాల్లో లోటు వర్షపాతం ఉంది. నిత్యం కరువుతో ఇబ్బందిపడే రాయలసీమ ప్రాంతమే కాకుండా ఇప్పుడు కోస్తాలోకూడా అలాంటి పరిస్థితులే చూస్తున్నాం. ఈ వెన్నుపోటు పార్టీ నాయకుడు, చంద్రబాబు రాష్ట్రంలో కరవు పరిస్థితులను గుర్తించడానికి ఇష్టపడ్డంలేదు. రైతులను, ప్రజలను ఆదుకోవడానికి ఏమాత్రం ముందుకు రావడంలేదు. ఖరీఫ్‌లో సాధారణ సాగుకన్నా.. 20 శాతం తగ్గింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత, మధ్యలో జులై 10న పంటలకు నీళ్లిస్తామంటూ ఇదే ప్రకాశంబ్యారేజీ లాకులవద్ద నీళ్లు విడుదలచేస్తున్నట్టుగా, ఫోజులిచ్చి, ఫొటోలు దిగి ఈ వెన్నుపోటు ప్రభుత్వంలోని మంత్రులు పబ్లిసిటీ స్టంట్ చేశారు. వీళ్లను నమ్మి, నీళ్లిస్తారు కదా అని, ఇక్కడ కృష్ణాడెల్టా రైతులే కాదు, మిగిలిన చోట్లకూడా రైతులు అప్పులు చేసి, పెట్టుబడి పెట్టి, అష్టకష్టాలుపడి పడి విత్తనాలు, ఎరువులు కొని, నార్లు వేశారు. ఆ నార్లన్నీ దాదాపుగా ఎండిపోయాయి. ప్రతి ఎకరాకు రైతు రూ.15వేలు నష్టపోయారు." ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కరవు తాండవిస్తోందని జగన్ అన్నారు. పరిస్థితులు ఇంత తీవ్రంగా ఉంటే చంద్రబాబు నుంచి స్పందన లేదని మండిపడ్డారు. భారీగా లోటు వర్షపాతం నమోదు అవుతున్నా దానికి తగ్గట్టు చర్యలు తీసుకున్న పరిస్థితి కనిపించలేదన్నారు. నీళ్లు ఇస్తున్నట్టు చాలా ప్రాంతాల్లో ప్రచారం చేసుకున్నారని, దీన్ని నమ్మిన రైతులు పంటలు వేసి మోసపోయారని ఆరోపించారు. ఒకవైపు వర్షాలు లేక ఇబ్బంది పడుతుంటే చంద్రబాబు నీటి విషయంలో మోసం చేసి మానవత్వం లేకుండా వ్యవహరించారని అన్నారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని విద్యుదుత్పత్తికి వాడేస్తున్నారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. మరోవైపు తెలంగాణ కూడా నీటిని తరలించుకుపోతుంటే చంద్రబాబు స్పందించడం లేదని అన్నారు. అవకాశం ఉన్న చోట నీరు ఇవ్వకుండా రైతు గొంతు కోస్తున్నారని ఆరోపించారు.

"ఒకవైపు వర్షాల్లేక సంక్షోభం వస్తే, మరోవైపు చంద్రబాబు నాయుడు, మానవత్వంలేకుండా వ్యహరిస్తున్నాడు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి నీళ్లుఇచ్చే విషయంలో ఆయన తీరు దుర్మార్గంగా ఉంది. శ్రీశైలం రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 885 అడుగులు అయితే, ఈ ఆగస్టులోనే 879.50 అడుగులకు నీళ్లు వచ్చినా, పోతిరెడ్డిపాడుద్వారా, కిందకు, రాయలసీమ ప్రాజెక్టులకు నీళ్లు ఇవ్వడానికి చంద్రబాబుకు మనసురాలేదు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కిందకు, రాయలసీమకు నీళ్లు అందాలంటే 880 అడుగులు ఉంటేనే, 44వేలపుల్ డిశ్చార్జ్‌తో ఇవ్వగలం. తగ్గేకొద్దీ పంపించగలిగే కెపాసిటీ కూడా తగ్గుతూ పోతుంది. 854 అడుగుల దిగువకు వస్తే ఒక్క నీటిచుక్కను కూడా పోతిరెడ్డిపాడు నుంచి పంపించలేం. మరోవైపు నాగార్జునసాగర్ కింద ప్రాంతాల్లోని వ్యవసాయం పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇక నాగార్జున సాగర్ కుడికాల్వ నుంచైనా, ఇటు కృష్ణాడెల్టాప్రాంతానికైనా చంద్రబాబు ఒక్క చుక్క నీరు ఇవ్వడంలేదు. మరోవైపు నాగార్జున సాగర్ కింద పులిచింతల వద్ద రెండు లిఫ్టులు అక్రమంగా లిఫ్టులు పెట్టి, పంపుహౌస్‌లు కడుతున్నా, చోద్యం చూస్తున్నారు. తెలంగాణలో చింతలపాలెం మండలం పాత వెల్లటూరు వద్ద పులిచింతల ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నుంచి 8 టీఎంసీలు తరలించడానికి రూ.1,450 కోట్లతో చేపట్టిన మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం పంప్ హౌజ్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇది కాకుండా తెలంగాణలోనే చింతలపాలెం మండలం బుగ్గమాదారం వద్ద పులిచింతల ప్రాజెక్టు దిగువన కృష్ణా నది నుంచి 2.5 టీఎంసీలు తరలించడానికి రూ.394 కోట్లతో చేపట్టిన రాజీవ్ ఎత్తిపోతల పథకం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. " సెప్టెంబర్ 15 నాటికి వర్షాలు ఆగిపోతాయని, తర్వాత పరిస్థితులు మరింత దుర్భరంగా మారతాయని జగన్ హెచ్చరించారు. అందుకు తగ్గట్టుగా ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తి విఫలమైందని ఆరోపించారు. తర్వాత ప్రాజెక్టుల్లో నీరు ఇచ్చే పరిస్థితి లేదని, రైతులను ఎలా ఆదుకుంటారో చంద్రబాబు చెప్పడం లేదని నిలదీశారు. ఒకపైపు నీరు ఇవ్వకుండా చేయడమే కాకుండా ఉచిత పంట బీమా పథకాన్ని నిర్వీర్యం చేశారని అన్నారు. ఇది కేంద్రమే స్వయంగా చెప్పిందని వివరించారు. ఉచిత పంట బీమాతోపాటు ఉచిత విత్తనాల పంపిణీ, సున్నా వడ్డీకే రుణాలు ఇలా తాము తీసుకొచ్చిన పథకాలను ఆపేసి రైతులను ముంచేశారని అన్నారు. వారికి ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవ పథకం డబ్బుల్లో కోత పెట్టారని అన్నారు. తమ హయంలో రైతులను ఆదుకొని వారికి మంచి చేస్తే చంద్రబాబు మాత్రం రైతులకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు.

"మరి ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు చంద్రబాబు రైతులను, రైతు కూలీలను, ప్రజలను అదుకుంటున్నాడా? అంటే అదీలేదు. రైతులకు ఆర్థిక రక్షణగా ఉండే వైయస్సార్ ఉచిత పంటల బీమాను రద్దుచేసి, రైతులకు తీవ్ర అన్యాయం చేశాడు. ఇప్పుడు రైతులే ప్రీమియం భారాన్ని కట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. 2022-23లో ఖరీఫ్ సీజన్‌లో 1.18 కోట్ల దరఖాస్తులకు ఉచిత బీమా వర్తిస్తే, ఈ 2026-27 ఖరీఫ్‌లో కేవలం 35.17 లక్షల దరఖాస్తులు మాత్రమే పంటలబీమా కిందకు వచ్చాయి. అంటే 2022-23 ఖరీఫ్‌తో పోలిస్తే, ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులమీదే ప్రీమియం భారం వేసిన ఈకొత్త బీమాలో కవర్ అయ్యింది కేవలం 30శాతం మాత్రమే కవర్ అయినట్టులెక్క. పంటల బీమా రక్షణ దాదాపు 70శాతం తగ్గిందనే చెప్పాలి. మరి రైతులను ఎవరు ఆదుకుంటారు? 2023-24 ఉచిత పంటలబీమాకు సంబంధించి జులైలో కట్టాల్సిన ప్రీమియంను చంద్రబాబు కట్టకుండా వదిలేశాడు. రైతులకు అందాల్సిన దాదాపు రూ.3వేల కోట్లు రైతులకు రాకుండా పోయాయి. 2025 అక్టోబరులో మొంథా తుపాను వస్తే, రైతులు దెబ్బతింటే ఇప్పటికీ ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. ఈ రకంగా పంటల బీమాను నాశనం చేశాడు, సీజన్ ముగిసేలోగా ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీనికూడా ఇవ్వడంలేదు, ఇ-క్రాప్‌నూ, రైతు భరోసా కేంద్రాలను, అగ్రిల్యాబ్స్‌ను నిర్వీర్య చేశాడు. ఏ పంటకూ గిట్టుబాటు ధరల్లేని పరిస్థితిని తీసుకు వచ్చాడు. సీఎం యాప్ ద్వారా గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునే వ్యవస్థనూ నాశనం చేశాడు. చివరకు రైతులకు సున్నావడ్డీ పథకాన్నికూడా ఎగరగొట్టాడు. కాని, వైయస్సార్‌సీపీ ఐదేళ్లకాలంలో, రైతులనుంచి ఒక్క రూపాయి కూడా ప్రీమియం తీసుకోకుండా, ప్రభుత్వమే కట్టి, ఆ ఉచిత పంటలబీమా కింద రూ.7,802 కోట్లు ఇచ్చి రైతులను ఆదుకున్నాం.

ఇంతతీవ్రమైన పరిస్థితుల నేపథ్యంలో రైతులను, రైతు కూలీలను, ప్రజలను చంద్రబాబు ఎలా ఆదుకున్నాడు? అసలు ప్లాన్ అనేది ఉందా? చంద్రబాబు రాష్ట్రం అంతా తిరుగుతూ, మాపైన తప్పుడు ప్రచారాలు, అబద్ధాలు చెప్పడానికి దృష్టిపెడుతున్నాడు కాని, కరువు సమయంలో ప్రజలను ఎలా ఆదుకుంటాడో చెప్పడం లేదు. ఇప్పటివరకూ ఒక్క మాటకూడా మాట్లాడ్డం లేదు. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లోనే వర్షాలు పడతాయి, అప్పుడే ఖరీఫ్ నడుస్తోంది. అలాంటప్పుడు జూన్, జులైలోనే 52% లోటు వర్షపాతం కనిపించినప్పుడు మీ కంటింజెన్సీ ప్లాన్ ఆగస్టుకే అమల్లో ఉండాలి కదా? వర్షపాతం మైనస్ - 52శాతం లోటు ఉందంటే, అలాంటి పరిస్థితుల్లో డ్రాట్ మానిటరింగ్ సెంటర్‌ను పూర్తి స్థాయిలో యాక్టివేట్ చేసి, డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ కంటింజెన్సీ ప్లాన్స్, క్రైసిస్ మేనేజ్మెంట్ ప్లాన్‌ను ఇప్పటికే అమలు చేసి ఉండాలి. ప్రతి జిల్లాలో డ్రాట్ కంటింజెన్సీ సెల్ ఏర్పాటు చేయాలి. కంటింజెన్సీ ప్లాన్ ప్రకారం డ్రాట్ రెజిలియెంట్/షార్ట్ డ్రాట్ సీడ్ స్టాక్స్ పంపిణీచేసి ఉండాలి. మరి ఇవన్నీ జరిగాయా? అంటే ఏమీ లేదు" మరి ఇప్పుడు తీరా సెప్టెంబరు వచ్చే సరికి, ఇక వర్షాలు ఎలాగూ పడవు, ఇక మీరు చేసే ప్లానింగ్ ఏముంది?దీని తర్వాత వ్యవసాయరంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కూలీలకు అదనంగా ఉపాధి హామీ పనులు కల్పించడం, పేదలు ఆహార భద్రతను కల్పించడం, జిల్లాల వారీగా ఫొడర్ అవైలబిలిటీని చూసుకోవడం, సర్‌ప్లస్ డిస్ట్రిక్స్/స్టేట్స్ నుంచి ఫొడర్ తెప్పించుకోవడం, ప్రత్యామ్నాయ విత్తనాలతోపాటు ఇవన్నీ చేయాలి కదా? మరేం చేస్తున్నారు? ఏమీ లేదు?" అని జగన్ నిలదీసారు.

2019 తర్వాత జీవో నంబర్-176 ఇచ్చి బీసీలకు 34శాతం రిజర్వేషన్లు ఇచ్చి, ఎన్నికలు నిర్వహించామని కాని చంద్రబాబు, తన పార్టీ నాయకుడు బిర్రు ప్రతాపరెడ్డి ద్వారా హైకోర్టులోనూ, సుప్రీంకోర్టులోనూ కేసు వేయించారని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు రిజర్వేషన్లు 50శాతం దాటుతున్నందుకు బీసీలకు 34శాతం కొట్టేస్తున్నామని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. హైకోర్టులు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని తెలిసి, ఇదే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టేసిందని తెలిసి కూడా మరోసారి మహా డ్రామాకు దిగారని జగన్ మండిపడ్డారు. మళ్లీ కోర్టుకు పోయి అడ్డుకోవద్దంటూ నాటకాలు ఆడుతున్నాడన్నారు. కోర్టుకు పోయేది ఆయనే, కొట్టివేయించేదీ ఆయనే, మళ్లీ దొంగ ఏడుపులు ఏడ్చేదీ ఆయనేనన్నారు. " బీసీల అభ్యున్నతి విషయంలో ఛాంపియన్ ఎవరైనా ఉన్నారంటే.. అది కేవలం వైయస్సార్‌సీపీ మాత్రమే. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వారి తలరాతలను మార్చే విప్లవాత్మక సంస్కరణలు ఆ ఐదేళ్లలో మేం తీసుకు వచ్చాం. కోర్టులు కొట్టేసినా, బీసీలకు ఆ మేరకు రాజకీయంగా ప్రోత్సాహం ఇవ్వాలని మాకు మేముగా నిర్ణయం తీసుకుని, 34శాతమే కాదు, అంతకంటే ఎక్కువ పదవులు ఇచ్చి, మా చిత్తశుద్ధిని చాటుకున్నాం. మా కేబినెట్‌లో 25 మంది ఉంటే, అందులో 11 మంది బీసీలే. అంటే దాదాపు 40 శాతం మంత్రిపదవులు బీసీలకే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సామాజిక వర్గాలకు డిప్యూటీ సీఎం పదవులు ఇస్తే, ఇందులో రెండు డిప్యూటీ సీఎం పదవులు బీసీలకే ఇచ్చాం. వైయస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర కోటాలో భర్తీ అయిన 11 రాజ్యసభ స్థానాల్లో నలుగురు బీసీలను ఈ జగన్ రాజ్యసభకు పంపారు. అంటే దాదాపు 36 శాతం ప్రాతినిధ్యం. చంద్రబాబు 2014-19 మధ్య ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదు. 25 లోక్‌సభ సీట్లలో 11 బీసీలకే అంటే 44 శాతం బీసీలకే ఇచ్చాం. 58 ఎమ్మెల్సీల్లో 28 బీసీలకే ఇచ్చాం. 13 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదువులు ఉంటే, 6 అంటే 46శాతం బీసీలకే, 13 మేయర్ పదవుల్లో, 9 అంటే, 69శాతం బీసీలకే. 636 ఎంపీపీ స్థానాల్లో, 239 అంటే 38 శాతం బీసీలకే, మున్సిపల్ ఛైర్మన్ పదవులు 84లో, 44 బీసీలకే, 639 జడ్పీటీసీల్లో, 227 అంటే, 36శాతం బీసీలకే, 8,239 ఎంపీటీసీల్లో, 3,361 అంటే, 41 శాతం మంది బీసీలే. 10,536సర్పంచుల్లో దాదాపు 4వేల మంది బీసీలే. అంటే 38శాతం వారికే. ఏఎంసీ ఛైర్మన్ పదవులు 196లో 76 అంటే 39శాతం బీసీలకే , ప్రభుత్వ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు 137లో, 53 బీసీలకు ఇచ్చాం. అంటే 37% ఇచ్చాం. 139 బీసీ కులాలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశాం. ఇన్ని కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కలలో కూడా చంద్రబాబుకు ఆలోచన రాలేదు. చట్టం చేసి మరీ. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం, నామినేటెడ్ పనులు--కాంట్రాక్టుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చాం. ఇందులో మహిళలకు కూడా 50% వాటా ఉండే విధానం మేం తీసుకు వచ్చాం. దేశంలోనే ఇది తొలిసారి. అంతేకాదు బీసీలకు చట్టసభల్లో 50 శాతం సీట్లు కేటాయించాలని కోరుతూ పార్లమెంటులో వైయస్సార్‌సీపీ ఎంపీలతో ప్రైవేట్ బిల్లు పెట్టించాం. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ, ప్రత్యేక బడ్జెట్ కోసం కూడా డిమాండ్ చేశాం. అలాగే బీసీ కులగణన కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. వివిధ డీబీటీ పథకాల ద్వారా బీసీల ఖాతాల్లోకి నేరుగా రూ.1.30లక్షల కోట్లు పంపించాం. నాన్ డీబీటీతో కలిపి 1.82లక్షల కోట్లు. కేవలం బీసీలకే. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, రైతుభరోసా, పెన్షన్ కానుక, చేయూత, ఆసరా, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా, వాహనమిత్ర, చేదోడు, తోడు, కళ్యాణమస్తు, షాదీతోఫా, సున్నావడ్డీ వంటి పథకాల ద్వారా ఈ ప్రయోజనం బీసీ కుటుంబాలకు చేరింది అని జగన్ వివరించారు. కాని ఇప్పుడు చంద్రబాబు బీసీల బతుకుల్ని బుగ్గిపాలు చేస్తున్నాడు. ఈ పథకాలన్నింటినీ ధ్వంసం చేశాడు. పైగా రాజకీయంగా బీసీల ఎదుగుదలను ఓర్చుకోలేక వారిమీద అక్రమకేసులు పెట్టి, జైల్లో పెట్టే కార్యక్రమం చేస్తున్నాడు. యాక్సిడెంట్ కేసును హత్యాయత్నం కేసుగా మార్చి మాజీ మంత్రి, మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన సీదిరి అప్పలరాజును జైల్లోపెట్టాడు. ఒక మహిళా ఎస్సైను అడ్డుపెట్టుకుని, జరగని దాన్ని జరిగినట్టుగా చూపించి, తప్పుడు కేసులు పెట్టి, ఆముదాలవలస నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త చింతాడ రవికుమార్‌ను జైలుకు పంపాడు. టీడీపీ కార్యకర్తలే దాడులు చేస్తే, పైగా తప్పుదోవ పట్టించడానికి అదే టీడీపీ కార్యకర్తచేత ఏకంగా ఆయన భార్య దుస్తులను చింపివేయించి, అదిచేసింది ఎమ్మెల్యే, అతని అనుచరులు అని చెప్పి, ఆలూరు ఎమ్మెల్యే, బోయ సామాజిక వర్గానికి చెందిన విరూపాక్షిపై కేసులు పెట్టి జైల్లోపెట్టారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కారుమూరు నాగేశ్వర్రావు, ఆయన కొడుకు కారుమూరి సునీల్‌ను అన్యాయంగా తప్పుడు కేసుల్లో జైలుకు పంపాడు. మరి చంద్రబాబుకు బీసీలమీద ప్రేమ ఉందంటే ఎవరైనా నమ్ముతారా? అని జగన్ నిలదీసారు.



# జనవరి 1 నుంచి సంజీవని

మొదటి పేజీ తరువాయి...

కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతోపాటు... డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్థవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చంద్రబాబు చెప్పారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం... హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16 శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



# రైల్వే మెగా ప్లాన్..!

## హై-డెన్సిటీ రూట్‌లలో ఫోర్ లైన్లు

## ఏడు కీలక మార్గాలపై ఫోకస్

## రూ. 4.2 లక్షలకోట్లకు పైగా ఖర్చు

## కేంద్ర ప్రభుత్వం కీలక ప్రణాళిక

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారత దేశంలో అతిపెద్ద ప్రజా రవాణా వ్యవస్థగా ఉన్న రైల్వే వ్యవస్థ అభివృద్ధిపై కేంద్రం ఫోకస్ పెట్టింది..ఇప్పటి వరకు దేశంలో హైవే లో ఫోర్ లైన్ వ్యవస్థ చూశాం..ఇకపై రైల్వేలో 4 లైన్ల వ్యవస్థ అందుబాటులోకి రానుంది. దేశంలోని అత్యంత రద్దీగా ఉండే హై-డెన్సిటీ రైల్వే మార్గాలను నాలుగు లైన్లుగా విస్తరించబోతున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు...దేశ రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యాన్ని భారీగా పెంచే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటుంది...ఇందులో భాగంగా దేశంలోని ఏడు కీలక హై-డెన్సిటీ రైలు మార్గాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మార్గాల మొత్తం పొడవు దాదాపు 11,000 కిలోమీటర్లుగా ఉంది..దేశ రైల్వే నెట్‌వర్క్‌లో ఇవి కేవలం 16 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, మొత్తం రైల్వే ట్రాఫిక్‌లో 41 శాతం రాకపోకలను ఈ మార్గాల గుండానే సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఈ హై-డెన్సిటీ మార్గాలను నాలుగు రైల్వే లైన్లుగా విస్తరించడం ద్వారా ప్రయాణికుల రవాణా, సరుకు రవాణా రైళ్లకు అదనపు సామర్థ్యం అందుబాటులోకి రానుంది.భవిష్యత్తులో పెరిగే ప్యాసింజర్, ఫ్రైట్ ట్రాఫిక్‌ను సులభంగా ఎదుర్కొనేందుకు ఈ విస్తరణ చాలా కీలకంగా కేంద్రం భావిస్తుంది..రైల్వే రవాణా వల్ల తక్కువ రవాణా ఖర్చులు, తక్కువ కాలుష్యం, పర్యావరణానికి మేలు జరుగుతుందని అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. దేశంలోని అత్యంత రద్దీగా ఉండే రైల్వే మార్గాల్లో సామర్థ్యాన్ని భారీగా పెంచే దిశగా హై-డెన్సిటీ నెట్‌వర్క్ ఫోర్-లైనింగ్ కీలక అడుగుగా నిలవనుంది.

**నాలుగు లైన్ల ప్రాజెక్ట్ కి రూ. 4.2 లక్షలకోట్లకు పైగా ఖర్చు**

దేశంలోని 7 కీలక హై-డెన్సిటీ రైల్వే మార్గాలలో మొత్తం 11,000 కి.మీ.ను నాలుగు లైన్లుగా విస్తరించే ప్రణాళికకు సంబంధించిన ఖర్చులు భారీగా ఉండనున్నాయి..2023లో భారతీయ రైల్వేలు ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం, ఈ 7 హై-డెన్సిటీ కారిడార్‌ల మల్టీ-ట్రాకింగ్ (డబులింగ్,థర్డ్ , ఫోర్త్ లైన్లు) కోసం 4.2 లక్షల కోట్లు కంటే ఎక్కువ పెట్టుబడి అవసరమని కేంద్రం అంచనా వేసింది.. ఇది సుమారు 10 సంవత్సరాల కాలంలో (2024-25 నుంచి 2033-34 వరకు) పూర్తి చేయాలని కేంద్రం భావిస్తుంది...ప్రస్తుతం మొత్తం ప్రాజెక్టుకు ఒకే సారి పూర్తి బడ్జెట్ మంజూరు కాకుండా, వివిధ సెక్షన్లుగా క్యాబినెట్ ఆమోదం తీసుకుంటూ పనులు జరుగుతున్నాయి.ఇప్పటివరకు హౌరా చెన్నై మార్గంలో ఫోర్ లైనింగ్ కోసం 410 కి.మీ గాను 9450 కోట్లు కేంద్రం కేటాయించింది..ఈ ప్రాజెక్టులు సెక్షన్-వారీగా ఆమోదం పొందుతున్నాయి కాబట్టి మొత్తం 11,000 కి.మీ.కు ఖచ్చితమైన తుది ఖర్చు ఇంకా నిర్ధారణ కాలేదు. దీని ఖర్చు భూసేకరణ, బ్రిడ్జిలు, టన్నెల్స్, సిగ్నలింగ్ వంటి అంశాలపై ఆధారపడి మారుతూ ఉంటుంది.

**ఏడు కీలక మార్గాలు ఇవే..**

ఢిల్లీ--హౌరా
హౌరా--చెన్నై
చెన్నై--ముంబై
ముంబై--ఢిల్లీ
ఢిల్లీ--చెన్నై
ముంబై--హౌరా
ఢిల్లీ--గువాహటి

# చికెన్.. డౌన్..!

## ధరలు భారీగా తగ్గుముఖం

## పెరిగిన సరఫరా.. తగ్గిన డిమాండ్

(విజయవాడ - జయజయహే)

చికెన్ ధరలు భారీగా డౌన్ అయ్యాయి. గత నెలలో ఏకంగా రూ.340కి చేరుకోగా.. ఇప్పుడు ఒకేసారి భారీ మొత్తంలో పడిపోయాయి. శ్రావణ మాసం రావడంతో చాలామంది మాంసానికి దూరంగా ఉంటున్నారు. ఈ కారణంతో సరఫరా ఎక్కువగా ఉండగా.. డిమాండ్ తక్కువగా ఉంది. డిమాండ్ తక్కువగా ఉండటంతోనే ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో మరింతగా తగ్గే అవకాశముందని చెబుతున్నారు. దీని వల్ల చికెన్ దుకాణాలకు కస్టమర్లు లేక ఆదాయం తగ్గుతుంది. శ్రావణ మాసం కావడంతో కస్టమర్లు తగ్గిపోయారని వ్యాపారులు చెబుతున్నారు. మరికొంతకాలం ఇదే పరిస్థితి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్‌లో కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.222గా పలుకుతుండగా.. డ్రస్సడ్ చికెన్ రూ.197గా ఉంది. ఇక ఎక్స్ ఫారం లైవ్ బర్డ్ రూ.100గా ఉండగా.. రిటైల్ లైవ్ బర్డ్ రూ.127 వద్ద కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ధరలను చూస్తే.. విజయవాడలో కిలో స్కిన్ లెస్ రూ.240 వద్ద లభిస్తుండగా.. డ్రస్సడ్ చికెన్ రూ.212 పలుకుతోంది. ఇక ఫారం దగ్గర లైవ్ బర్డ్ రూ.110గా ఉండగా.. రిటైల్ లైవ్ బర్డ్ రూ.137 వద్ద కొనసాగుతోంది.

**కోడి గ్రుడ్ల ధరలు కిందకే..**

కోడి గ్రుడ్ల ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. విజయవాడలో 12 గ్రుడ్ల రిటైల్ ధర రూ.75గా ఉంది. ఇక హైదరాబాద్, కరీంనగర్ జోన్‌లో 12 గుడ్ల ధర రూ.74గా ఉంది. గత నెలలో కోడి గుడ్ల ధరలు భారీగా పెరిగాయి. ఒక్కో గుడ్డు ధర రూ.8కి చేరుకుంది. కానీ ఇప్పుడు ఒక్కో గుడ్డు రూ.6 పలుకుతోంది. ఇక గత నెలలో చికెన్ ధరలు రూ.350కి చేరుకోగా.. ఇప్పుడు రూ.220కి పడిపోయాయి. ఏకంగా రూ.100కిపైగా తగ్గి ఊరటనిచ్చింది. రానున్న కొద్ది రోజుల పాటు చికెన్, కోడి గుడ్ల ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. శ్రావణ మాసం రావడంతో చికెన్, కోడి గుడ్లకు డిమాండ్ తగ్గినట్లు చెబుతున్నారు. మరోవైపు షుగర్, ఉల్లిపాయలు ధరలు పెరుగుతున్నారు. కిలో ఉల్లి రూ.60కి చేరుకుంది. కేజీ పంచదార రూ.60కి చేరుకుంది. ఇక నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్యుల నెత్తి బండ పడినట్లయింది.

# అసెంబ్లీకి అద్భుత డిజైన్‌లు

**భవనం పైభాగంలో టవర్**


**రాజధాని మొత్తం వీక్షించొచ్చు**

**సందర్శకుల కోసం ఎక్స్ పీరియన్స్ సెంటర్**

**అందరూ సమావేశమయ్యేలా సెంట్రల్ హాల్**

**మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

**(అమరావతి - జయజయహే)**



ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాజధాని నిర్మాణంలో భాగంగా అసెంబ్లీ భవనాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూపొందిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీ భవనం పైభాగంలో టవర్ ఏర్పాటు చేసి.. అక్కడి నుంచి మొత్తం రాజధాని ప్రాంతాన్ని వీక్షించేలా నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో జరిగే నియోజకవర్గాల డీలిమిటేషన్‌ను దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీ భవన డిజైన్లపై చర్చించినట్లు మంత్రి తెలిపారు. 265 అసెంబ్లీ స్థానాలు, 110 శాసనమండలి స్థానాలకు అనుగుణంగా భవన నిర్మాణ డిజైన్‌ను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అసెంబ్లీని సందర్శించే ప్రజలకు మంచి అనుభూతి కలిగేలా ప్రత్యేకంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. గవర్నర్ ప్రసంగించే సమయంలో అసెంబ్లీ, శాసనమండలి సభ్యులు ఒకే చోట కూర్చునేలా సెంట్రల్ హాల్ ఏర్పాటు చేయడానికి అనువుగా డిజైన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణం చుట్టూ పచ్చదనం ఉండేలా, ఒక గార్డెన్‌లా కనిపించే విధంగా అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు మంత్రి తెలిపారు. మంత్రులు, విప్‌లు, కమిటీ చైర్మన్లు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అసెంబ్లీ డిజైన్‌ను రూపొందిస్తున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు.

## కూటమి ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ సవాళ్లు

**మొదటి పేజీ తరువాయి...**

కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పేదలకు నాణ్యమైన వైద్య విద్య, వైద్య సేవలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే లభించాలని వైఎస్సార్‌సీపీ వాదిస్తోంది. ఈ నిర్ణయం పేదల వైద్య విద్య కలలను, ఉచిత ఆరోగ్య భవిష్యత్తును దెబ్బతీస్తుందని ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో, వైఎస్సార్‌సీపీ ఒక భారీ ప్రజా ఉద్యమానికి తెర లేపింది. వైఎస్సార్‌సీపీ ఈ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలను సేకరించే బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది 45 రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని 175 నియోజకవర్గాలలో నిర్వహించబడుతోంది. సంతకాల సేకరణ పూర్తయ్యాక, వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆ కోటి సంతకాల పత్రాలను గవర్నర్‌కు సమర్పించనున్నారు. ప్రజా ఉద్యమంతో పాటు, ఈ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయస్థానంలో కూడా చట్టపరమైన పోరాటం చేయాలని వైఎస్సార్‌సీపీ యోచిస్తోంది. వైఎస్సార్‌సీపీ హయాంలో 17 కొత్త వైద్య కళాశాలలకు శంకుస్థాపన చేస్తే, వాటిని పూర్తి చేయకుండానే ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వెనుక అధికార పార్టీ పెద్దల స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికార కూటమిపై మరో ముఖ్యమైన ఆందోళనను లేవనెత్తింది: అదే తురకపాలెం నాటుసారా (చీప్ లిక్కర్) కేసు. ఇటీవల రాష్ట్రంలో అక్రమంగా నాటుసారా ఉత్పత్తి అవుతోందని, దీని వెనుక అధికార పార్టీ నాయకుల లిక్కర్ మాఫియా ప్రమేయం ఉందని వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. ఈ కేసులో నిజానిజాలు, అక్రమార్కుల పాత్ర వెలుగులోకి రావాలంటే, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే విచారణ సరిపోదని, వెంటనే నకిలీ మద్యం పై సీబీఐ విచారణ జరిపించాలి అని వైఎస్సార్‌సీపీ గట్టిగా డిమాండ్ చేస్తోంది. అంతేకాకుండా, తురకపాలెం నాటుసారా మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. తద్వారా అక్రమ మద్యం సిండికేట్‌ను పూర్తిగా బయటపెట్టాలని మరియు బాధితులకు న్యాయం చేయాలని పోరాడుతోంది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇటీవల చేపట్టిన ఉత్తరాంధ్ర పర్యటనకు ప్రజల నుంచి లభించిన భారీ మద్దతు, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ పర్యటన విజయం తరువాత, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై మరింత దూకుడుగా వ్యవహరించాలని, ప్రజా సమస్యలపై వెంటనే పోరాటం చేయాలని నిర్ణయించుకుంది. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వంటి అంశాలు సామాన్య ప్రజల ఆరోగ్య, విద్య హక్కులకు సంబంధించినవి కావడంతో, ఈ ఉద్యమాలు ప్రభుత్వానికి తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. ఎన్నికల ఓటమి తర్వాత నిశ్శబ్దంగా ఉన్న వైఎస్సార్‌సీపీ, ఇప్పుడు ఈ ఉద్యమాల ద్వారా మళ్లీ ప్రజల్లోకి వెళ్తూ, ప్రతిపక్షం యొక్క గళాన్ని బలంగా వినిపించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ పరిణామాలు రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను మరింత వేడెక్కించడం ఖాయంగా కనిపిస్తోంది.



## రేషన్ డీలర్ల సమస్యలపై తహసీల్దార్‌కు వినతి..

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 27,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల గిరిజన ప్రాంతాల్లో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సాంకేతిక, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన రేషన్ డీలర్ల సంఘం కొయ్యూరు మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ కి వినతిపత్రం అందజేశారు.వాటిలో రేషన్ డీలర్ల సంఘం నాయకులు కొన్ని సమస్యలు తెలుపుతూబియ్యం బస్తాలపై ట్యాగ్ ను రెండుసార్లు స్కాన్ చేయాల్సి రావడంతో పనిభారం, డేటా ఖర్చులు పెరుగుతున్నాయి అని కొయ్యూరు ఏజెన్సీలో మొబైల్ నెట్‌వర్క్, విద్యుత్ అంతరాయంతో స్కానింగ్ లో ఇబ్బందులు,స్కాన్ ఫెయిల్ అయితే డీలర్లపై చర్యలు తీసుకుంటున్నారు అని చెప్పారు. స్కానింగ్ విధానాన్ని సరళీకరించి,నెట్‌వర్క్ లేని చోట ప్రత్యామ్నాయ పంపిణీ విధానం కల్పించి.అదనపు పనిభారానికి తగిన పారితోషికం ఇవ్వాలి అని, గిరిజన డీలర్లకు ప్రత్యేక కమిషన్ పెంపు అమలు చేసి,సాంకేతిక లోపాలకు డీలర్లపై చర్యలు లేకుండా,సెప్టెంబర్ 1న డిపోలు మూసివేసి చేపట్టే శాంతియుత నిరసనకు అనుమతి ఇవ్వాలన్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ స్పందిస్తూ, డీలర్ల సమస్యలను అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు సబ్ కలెక్టర్, సివిల్ సప్లైస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## గల్లంతైన మత్స్యకారులు క్షేమం

**మొదటి పేజీ తరువాయి...**

గుర్తించారు. అల్లవరం మండలం ఓడలరేవుల నుంచి సముంద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల ఆచూకీ లభించిందని మత్స్యశాఖ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆ ఏడుగురితో జిల్లా యంత్రాంగం సంప్రదింపులు జరిపిందని, వారందరూ ఆరోగ్యంతో, క్షేమంగా ఉన్నారని కలెక్టర్‌కు సమాచారం అందింది. ప్రమాదం జరిగిందనే భయంతో ఉన్న కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారంతా సురక్షితంగా తిరిగి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని కోనసీమ జిల్లా అధికారులు స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఓడలరేవు జెట్టీ తీరం నుంచి ఆగస్టు 3వ తేదీన మత్స్యకారుల బృందం ఒక బోటులో సముద్రంలోకి చేపల వేటకు వెళ్లింది. వారు తమ వేట ముగించుకుని ఆగస్టు 12వ తేదీ నాటికి తీరానికి చేరుకోవాల్సి ఉంది. అయితే, గడువు ముగిసి రోజులు గడుస్తున్నా బోటు కానీ, అందులో ఉన్న మత్స్యకారులు కానీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సమాచారాన్ని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యకారుల ఆచూకీ కనుగొనేందుకు భారీ స్థాయిలో సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. గల్లంతైన మత్స్యకారుల కోసం సముద్రంలో వివిధ కోణాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినా రెండు వారాలుగా ఆచూకీ లేకపోయింది. సముద్ర గర్భంలోనూ అన్వేషించేందుకు ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకలతో పాటు మెరైన్ పోలీసుల పూర్తి సహకారం తీసుకున్నారు. గల్లంతైన బోటు ప్రవాహానికి కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం లేదా ఒడిశాలోని పారాదీప్ తీర ప్రాంతాల వైపు కొట్టుకుపోయే అవకాశం ఉందన్న ముందస్తు అంచనాతో, ఆయా తీరాల్లోని అన్ని వేట బోట్లను అధికారులు అప్రమత్తం చేశారు. విశాఖపట్నం నుంచి పారాదీప్ మధ్య ఉన్న తీరప్రాంతంలో సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల అధికారులను ఆదేశించారు. అలాగే ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. గల్లంతైన మత్స్యకారులను త్వరగా గుర్తించి సురక్షితంగా ఒడ్డుకు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో దాదాపు 23 రోజుల తరువాత మత్స్యకారుల ఆచూకీ లభ్యమైంది. మత్స్యకారులను స్వస్థలాలకు క్షేమంగా తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

## దశాబ్దాల కల సాకారమయ్యే వేళ..!

**మొదటి పేజీ తరువాయి...**

పూర్తయ్యింది. మంగళవారం ట్రాఫిక్‌ను మళ్లించారు. ఆయాచోట్ల ప్రధాన రహదారి తవ్వకం పనులు చేపడుతున్నారు. ఈ పనులు గురువారం నాటికి పూర్తవుతాయని, అనకాపల్లి జిల్లాకు నీరు వెళ్లేందుకు మార్గం సుగమమైందని అధికారులు తెలిపారు. ఐదారు రోజుల్లో కాలువలో గోదారమ్మ సందడి చేయనుంది. ఇప్పటికే నీటి ప్రవాహం మొదలైందని, బుధవారం సాయంత్రానికి రావికంపాడు వద్దకు చేరుతుందని ఈఈ గోవింద్ పేర్కొన్నారు. అక్కడి నుంచి క్రమంగా (సుమారు 1,000-1,500 క్యూసెక్కులు) నీరు పాయకరావుపేట మీదుగా అనకాపల్లి జిల్లాకు వెళ్లనుంది. ప్రతిష్ఠాత్మకంగా జరిగిన పనుల్లో అనేక సవాళ్లను అధిగమించారు. తొమ్మిది చోట్ల జాతీయ రహదారిని దాటి కాలువ ముందుకు సాగింది. అన్నవరం పంపా జలాశయం, తుని పట్టణ పరిధిలో తాండవ నది పరీవాహక ప్రాంతంపై అక్విడక్టులు నిర్మించారు. కుమ్మరిలోవ వద్ద రెండు కొండలను తొలుచుకుంటూ కాలువ నిర్మాణం జరిగింది. పంపా, ఏలేరు రిజర్వాయర్ల పరిధిలో ఆయకట్టుకూ నీరు అందే పరిస్థితులు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 1.15 లక్షలు, కాకినాడలో 1.21 లక్షలు, అనకాపల్లి జిల్లాలో 1.50 లక్షల ఎకరాలకు నీరందనుంది. సాగునీటికి 84.808 టీఎంసీలు, తాగు అవసరాలు, పరిశ్రమలకు 23.44 టీఎంసీలను సర్కారు కేటాయించనుంది. పోలవరం పోలవరం ప్రాజెక్టు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచడానికి రూ.840 కోట్లతో ఆమోదం తెలిపినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఎన్‌హెచ్-365 బీబీ సెక్షన్‌లో ఉన్న బుట్టాయగూడెం - ఎల్ఎన్‌డీపేట మధ్య 45.09 కిలోమీటర్ల రహదారిని ఉన్నతీకరించడంతో పాటు పట్టిసీమ - కొవ్వూరు రహదారిని పేవ్‌డ్ షోల్డర్స్ సౌకర్యంతో రెండు వరుసలుగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## నేడు భారీ ఉద్యోగ మేళా

**ఏంపిడిఓ జిడివి ప్రసాద్..**

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 27,**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆగస్టు 27వ తేదీన చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారీ ఉద్యోగ మేళా జరగనుంది. ఈ మేళాకు 10 పెద్ద కంపెనీలు రానున్నాయి. అర్హత ఉన్న యువతను అక్కడికక్కడే ఎంపిక చేస్తారు. చింతపల్లి, కొయ్యూరు, జీకే వీధి, జి.మాడుగుల మండలాల్లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వాడుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఉపాధి నైపుణ్య వేదికలో పేరు నమోదు చేసుకున్న వారితో పాటు కొత్త వారు కూడా నేరుగా రావచ్చు అన్నారు. వచ్చే వారు చదువు పత్రాలు, ఆధార్ కార్డు, వివరాల పత్రంతో రావాలని అధికారులు తెలిపారు.




## మదర్ తెరిసాకు ఘన నివాళులు అర్పించిన డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి...

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

భారతరత్న, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ తెరిసా 116వ జయంతి సందర్భంగా సమిశ్రగూడెంలో ఆమె విగ్రహానికి డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదర్ తెరిసా మానవ సేవే మాధవ సేవగా భావించి, నిరుపేదలు, అనాథలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. మానవత్వం, సేవా భావం, కరుణకు మదర్ తెరిసా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు.ఆమె చూపిన మానవతా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, సేవా స్ఫూర్తిని తమ జీవితాల్లో ఆచరించాలని డాక్టర్ తోపరాల కళ్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. మదర్ తెరిసా ఆశయాలను కొనసాగించడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు.



## ప్రియుడు కారుపై లవర్ 3,400 ముద్దులు

**మొదటి పేజీ తరువాయి...**

నింపేసింది. ఆ కారు వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, కేవలం 24 గంటల్లోనే 55 లక్షలకు పైగా వ్యూస్ దాటేసింది. అయితే ఆ ప్రియుడికి ట్రాఫిక్ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. విదేశాల్లో ట్రెండ్ అవుతున్న కిస్సింగ్ కార్ వీడియోల ఐడియాతో 'రాత్రికి రాత్రే సోషల్ మీడియాలో స్టార్ అయిపోదాం అనుకున్నారు గ్వాలియర్‌కు ప్రేమ జంట. అందుకోసం యువతి తన ప్రియుడి కారుపై ఏకంగా 3,400 సార్లు లిప్‌స్టిక్‌తో ముద్దు ముద్రలు వేసింది. దీన్ని ఓ వీడియోగా తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా, అది కొన్ని క్షణాల్లో వైరల్ అయింది. కేవలం 24 గంటల్లోనే 55 లక్షలకు పైగా వ్యూస్ దాటింది. ఆ కారుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

**ప్రియుడికి జరిమానాతో షాక్**

ఆ వీడియో కాస్త ట్రాఫిక్ పోలీసుల దృష్టికి వెళ్లింది. రీల్‌లో కనిపించిన కారు రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించారు. అనంతరం కారు యజమాని ఆదిత్యను వాహనంతో సహా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. అక్కడ వాహన నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి అధికారులు చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా కారును నడిపినందుకు మోటార్ వెహికల్ యాక్ట్ కింద రూ.5,500 జరిమానా విధించారు. ఫైన్ కట్టించుకోవడంతోనే పోలీసులు ఊరుకోలేదు. కారుపై ఉన్న లిప్‌స్టిక్ ముద్దుల గుర్తులను కూడా తొలగించాలని పోలీసులు సూచించారు. దీంతో యువకుడు స్వయంగా పోలీస్ స్టేషన్‌లోనే కారుపై ఉన్న గుర్తులన్నింటినీ శుభ్రం చేశాడు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ అభిషేక్ రఘువంశీ మాట్లాడుతూ, సోషల్ మీడియా ద్వారా ఈ కారు గురించి తమకు సమాచారం అందిందని తెలిపారు. కారు రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా యజమానిని గుర్తించి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించినట్లు చెప్పారు. మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనల ఉల్లంఘనకు రూ.5,500 చలాన్ విధించినట్లు వెల్లడించారు. జరిమానా చెల్లించిన అనంతరం యువకుడు తన తప్పును అర్థం చేసుకుని కారుపై ఉన్న లిప్‌స్టిక్ గుర్తులను తానే తొలగించాడని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు కేవలం జరిమానాలు విధించేందుకు కాదని, వాహనదారులు, ప్రయాణికులు, రహదారిపై వెళ్లే ఇతరుల భద్రత కోసమేనని పోలీసులు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ కావాలనే ఉద్దేశంతో నిబంధనలను ఉల్లంఘించడం సరికాదని సూచించారు.

ఈ ఘటనపై కారు యజమాని స్పందిస్తూ, సోషల్ మీడియాలో రీల్ వైరల్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ ప్రయత్నం చేసినట్లు చెప్పాడు. ఈ చర్య ద్వారా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తమకు తెలియదని పేర్కొన్నాడు. తాము కేవలం ఓ కొత్త ట్రెండ్ సృష్టించాలనే ఉద్దేశంతో వీడియో చేశామని, అయితే అది నిబంధనలకు విరుద్ధమని పోలీసుల ద్వారా తెలుసుకున్నామని తెలిపాడు. తన తప్పును అంగీకరించి చలాన్ చెల్లించానని, ఇకపై ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటిస్తానని పోలీసులకు హామీ ఇచ్చినట్లు వెల్లడించాడు. సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం ఇలాంటి పిచ్చి స్టంట్లు చేస్తే రీల్స్ సంగతి ఏమో కానీ, రియల్ లైఫ్‌లో పోలీసుల నుంచి భారీగా ఫైన్లు, క్రమశిక్షణ చర్యలు తప్పవు! ట్రాఫిక్ నిబంధనలు మన భద్రత కోసమే అని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

For a pure tomorrow.. జయ జయహే



# మనసా ఎటులోర్తునే ?

(సి.హెచ్.ప్రతాప్)

**మనసును జయించడమే నిజమైన సాధన**

మనిషిని నడిపించేది శరీరం కాదు, మనసు. మనసు ప్రశాంతంగా ఉంటే సమస్యల మధ్య కూడా వివేకంతో నిర్ణయం తీసుకోగలం; అదే మనసు ఆందోళన, కోరిక, కోపం, అసూయ, భయాలకు లోనైతే మనిషి తెలిసిన మంచిని కూడా ఆచరించలేడు. అందుకే భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో మనసు నియంత్రణకు అత్యున్నత స్థానం లభించింది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా మనసు చంచలమైనదేనని అంగీకరిస్తూనే, అభ్యాసం, వైరాగ్యంతో దానిని నియంత్రించవచ్చని బోధించాడు.

ఈ సత్యాన్నే త్యాగరాజ స్వామి తన అపూర్వ కీర్తన మనసా ఎటులోర్తునేలో తన మనసునే సంబోధిస్తూ ప్రశ్నిస్తారు. మలయమారుత రాగంలో, రూపక తాళంలో ఉన్న ఈ కీర్తనలో ఆయన మనసుతో ఒక అంతర్మథనాన్ని సాగిస్తారు. "ఓ మనసా! నా మాట ఎందుకు వినవు? నేను చెప్పేది ఎందుకు అంగీకరించవు?" అన్న ఆవేదన పల్లవిలోనే వ్యక్తమవుతుంది.

త్యాగరాజుకు మనసును నియంత్రించడం అంటే దానిని బలవంతంగా అణచివేయడం కాదు; దానికి సరైన దిశను చూపించడం. శ్రీరాముని స్మరిస్తూ, వినయంతో భజన చేస్తూ కాలాన్ని సార్థకం చేసుకోవాలని ఆయన తన మనసుకు చెబుతారు. ముఖ్యంగా రాజస, తామస గుణాలు కలిగిన వారి చెడు సాంగత్యంలో పడి జీవితాన్ని వృథా చేయవద్దని హెచ్చరిస్తారు. మంచి ఆలోచనలు, సత్సంగం, భక్తి మనసుకు దిశానిర్దేశం చేస్తాయని ఆయన సందేశం.

అసలు త్యాగరాజు ఈ పాటను ఎందుకు రాశారు? ఇతరులకు ఉపదేశం చేయడానికి కాదు; మనిషి తనతో తానే చేసే సంభాషణగా ఈ కీర్తనను చూడాలి. మనసు ఒకటి కోరుతుంది, వివేకం మరొకటి చెబుతుంది. చేయకూడదని తెలిసినా మనిషి అదే పనిని చేయడం మనస్సు స్వభావంలోని బలహీనతను చూపుతుంది. అందుకే త్యాగరాజు తన మనసునే ప్రశ్నించారు.

ఈ కీర్తన నేటికీ అంతే ప్రాసంగికం. సోషల్ మీడియా, నిరంతర సమాచారం, పోటీ, కోరికలు మనసును మరింత చంచలంగా చేస్తున్న కాలంలో ధ్యానం, నామస్మరణ, సత్సంగం, ఆత్మపరిశీలన, ఇంద్రియ నియమం మనసుకు స్థిరత్వాన్ని ఇస్తాయి. మనసును జయించినవాడు పరిస్థితులను జయించగలడు. అందుకే త్యాగరాజు సందేశం ఒక్కటే--- ప్రపంచాన్ని మార్చే ముందు మనసును మార్చుకో; మనసు మారితే జీవితం మారుతుంది.

# వాన కాదు.. విఫలమైన నగర ప్రణాళికే ముంచుతోంది

(ప్రతాప్)

**వర్షం పడటం ప్రకృతి సహజం. కానీ వర్షం వస్తే నగరం స్తంభించిపోవడం మాత్రం సహజం కాదు. రహదారులు కాలువలుగా మారడం, వాహనాలు గంటల తరబడి నిలిచిపోవడం, పాఠశాలలు మూతపడటం, కార్యాలయాలు ఇంటి నుంచే పనిచేయాలని సూచించడం.. ఇవన్నీ ఇప్పుడు భారత నగరాల్లో వర్షాకాలపు సాధారణ దృశ్యాలుగా మారుతున్నాయి. వర్షాన్ని నిందించడం సులభం. కానీ వర్షాన్ని తట్టుకోలేని నగర నిర్మాణాన్ని ప్రశ్నించడమే అసలు అవసరం.**



ఆగస్టు 24న గురుగ్రామ్‌లో కురిసిన భారీ వర్షం ఈ వైఫల్యాన్ని మరోసారి కళ్లకు కట్టింది. కొన్ని గంటల్లోనే ప్రధాన రహదారులు, కూడళ్లు నీట మునిగాయి. పాఠశాల బస్సులు, అంబులెన్సులు కూడా నీటిలో చిక్కుకున్నాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో ఆగస్టు 25న కార్యాలయాలు, పాఠశాలలు ఇంటి నుంచే పనిచేయాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

ఇది ఒక్క గురుగ్రామ్ సమస్య కాదు. ఆగస్టు 24న ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో కూడా భారీ వర్షంతో సంగమ్ విహార్, జఖీరా, వాటికా చౌక్, న్యూ అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో నీట మునక ఏర్పడింది. కీలక రహదారులపై రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఢిల్లీ విమానాశ్రయ కార్యకలాపాలపైనా ప్రభావం పడింది.

ఇలాంటి ఘటనలు ప్రతి సంవత్సరం కొత్తవి కావు. కానీ వర్షపు తీవ్రత, నగరాల విస్తరణ, కాంక్రీట్ నిర్మాణం పెరుగుతున్న వేగం మాత్రం కొత్త సవాళ్లను సృష్టిస్తున్నాయి. నగరాలు



వేగంగా పెరుగుతున్నాయి. భవనాలు, రహదారులు, వంతెనలు, వాణిజ్య సముదాయాలు పెరుగుతున్నాయి. వాటికి తగ్గట్టుగా వర్షపు నీటిని మళ్లించే వ్యవస్థలు మాత్రం అదే వేగంతో అభివృద్ధి చెందడం లేదు.

ఒకప్పుడు వర్షపు నీటిని భూమిలోకి చేర్చే చెరువులు, కాలువలు, ఖాళీ ప్రదేశాలు, సహజ నీటి ప్రవాహ మార్గాలు ఉండేవి. ఆక్రమణలు, అనియంత్రిత నిర్మాణాలు, కాంక్రీట్ విస్తరణతో వాటి సామర్థ్యం తగ్గిపోయింది. ఫలితంగా కొద్దిసేపటి భారీ వర్షమే రహదారులపైకి ప్రవహిస్తోంది.

అసలు లోపం నగర ప్రణాళికలోనే ఉంది. రహదారిని ఒక విభాగం, భవనాలను మరో సంస్థ, వర్షపు నీటి కాలువలను ఇంకో విభాగం పర్యవేక్షిస్తే.. మొత్తం నగరాన్ని ఒకే నీటి ప్రవాహ వ్యవస్థగా ఎవరు చూస్తారు? ప్రతి కొత్త నిర్మాణానికి కేవలం స్థల వినియోగ అనుమతి కాకుండా, వర్షపు నీటి ప్రవాహంపై దాని ప్రభావాన్ని కూడా తప్పనిసరిగా అంచనా వేయాలి.

ప్రధాన నగరాలకు ఇక 'వర్ష నిరోధక సామర్థ్య తనిఖీ' తప్పనిసరి చేయాలి. ఏ ప్రాంతం ఎంత వర్షపాతాన్ని తట్టుకోగలదు? సహజ నీటి మార్గాలు ఎక్కడున్నాయి? ఎక్కడ ఆక్రమణలు ఉన్నాయి? ఎక్కడ నీరు నిలిచే ప్రమాదం ఎక్కువ? అత్యవసర సమయంలో ఆసుపత్రులు, పాఠశాలలు, రవాణా వ్యవస్థలు ఎలా పనిచేయాలి? అన్నదానిపై శాస్త్రీయ పటాలు, కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం కావాలి.

ఇది కేవలం ఆలోచన స్థాయిలో లేదు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కోల్‌కతా, ముంబై, పుణె వంటి ఏడు నగరాలకు పట్టణ వరదల ప్రమాద నివారణ కార్యక్రమం కింద రూ.3,075.65 కోట్లను ఆమోదించింది. మరో 11 నగరాలను రెండో దశలో చేర్చింది. ఇప్పుడు అసలు పరీక్ష ఆ నిధులు ఎంత సమర్థంగా, ఎంత వేగంగా భూమిపై మార్పు తీసుకొస్తాయన్నదే.

నగరం గంటల తరబడి స్తంభిస్తే నష్టం నీట మునిగిన రహదారులతో ముగియదు. ఉద్యోగుల పనిగంటలు, వ్యాపారాలు, సరకు రవాణా, విద్య, అత్యవసర వైద్య సేవలు.. అన్నీ దెబ్బతింటాయి. అందుకే పట్టణ వరద నిర్వహణను వర్షం వచ్చిన తర్వాత సహాయక చర్యగా కాకుండా నగర పరిపాలనలో శాశ్వత బాధ్యతగా మార్చాలి.

వర్షాన్ని ఆపలేం. వర్షపాతం తీవ్రతను పూర్తిగా నియంత్రించలేం. కానీ వర్షం వచ్చిన ప్రతిసారీ నగరం ఆగిపోకుండా చూడగలం. ప్రకృతిని ఎదుర్కొనే నగరం కాదు.. ప్రకృతి నీటి ప్రవాహాన్ని అర్థం చేసుకుని నిర్మించుకున్న నగరమే భవిష్యత్తుకు సిద్ధమైన నగరం.

వర్షం ప్రకృతి పరీక్ష. నగరం మునిగిపోవడం మాత్రం పాలన పరీక్ష. ప్రతి ఏడాది ఒకే ప్రాంతాలు మునుగుతున్నాయంటే సమస్య వర్షంలో లేదు.. మన ప్రణాళికలో ఉంది.

# మహిళా సాధికారతకు వేదిక "ది స్త్రీ లవ్ థైసెల్ఫ్"


**సుడా చైర్మన్ కొరికాన.రవి కుమార్**

**శ్రీకాకుళం. (జయ జయహే)**

మహిళా సాధికారతకు వేదిక, ది స్త్రీ లవ్ థైసెల్ఫ్ అని, శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ కొరికాన.రవికుమార్ అన్నారు. స్థానిక సుడా కార్యాలయంలో, ది స్త్రీ లవ్ థైసెల్ఫ్ సంస్థ సహకారంతో, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ సేవలలో ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించారు. అనంతరం ఆయన, పిసిని.చంద్రమోహన్ తో కలసి, బుధవారం మాట్లాడుతూ బెంగుళూరు భావన రాజేష్ స్థాపించిన జ్ఞానస్మృతిసంస్థ, "ది స్త్రీ లవ్ థైసెల్ఫ్" గా రూపాంతరం చెందిందని, కరోన మహమ్మారి సమయంలో నిస్వార్ధ సేవలందించిన మహిళలను గుర్తించి, బెంగళూరు ఒక హోటల్ లో స్త్రీ లీడ్‌హెర్ అవార్డ్స్ 2026ను నిర్వహించి, ఒకే రోజున 365 మంది మహిళా విజేతలను సత్కరించారన్నారు. సామూహిక సన్మానం, "ఒక సంస్థచే గుర్తింపు పొందిన అత్యధిక మహిళా సాధకులు" విభాగంలో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుండి అధికారిక ప్రశంసాపత్రాన్ని కూడా అందుకున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లా అవార్డు గ్రహీతలు ఉమా గౌరీ, సావిత్రి, సమీరా, ప్రశాంతి లకు జ్ఞాపికను, ప్రశంసాపత్రం అందించి, దుస్సాలువాలతో సత్కరించారు. అలాగే శ్రీకాకుళం సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి చేస్తున్న నిరుపమాన సేవలను



ప్రత్యక్షముగా చూస్తున్నామని, కరోనా సమయంలో సేవచేసిన మహిళలను గుర్తించి, నా చేతుల మీదుగా, వారిని సత్కరించే భాగ్యాన్ని కలిగించిన పొట్నూరు.వరప్రసాద్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు. ఈ సత్కార కార్యక్రమంలో స్త్రీ లీడ్‌హెర్ అవార్డ్స్ గ్రహీత మహిళలు, ది స్త్రీ లవ్ థైసెల్ఫ్ సభ్యులు, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి సభ్యులు, సిల్లా.బాలకృష్ణ, బరాటం చంద్రశేఖర్, పొడుగు.చరణ్, సుడా సిబ్బంది పాల్గొన్నారు.




## శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయంలో

# ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా సెప్టెంబర్ 4, 2026 శుక్రవారం రోజున ముత్తైదువులచే ఉచిత సామూహిక శ్రావణ వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి. హరి సూర్య ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న సామూహిక వరలక్ష్మి వ్రతానికి సంబంధించిన దరఖాస్తులు ఆగస్టు 27, 2026 గురువారం నుంచి ఆలయ కౌంటర్‌లో భక్తులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ముత్తైదువులు ఆలయ కౌంటర్‌లో దరఖాస్తులు పొందాలని సూచించారు. శ్రావణ మాసంలో ఎంతో విశిష్టమైన వరలక్ష్మి వ్రతాన్ని ఉచితంగా సామూహికంగా నిర్వహిస్తున్నందున భక్తులు, ముత్తైదువులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వి. హరి సూర్య ప్రకాష్, సహాయ కమిషనర్ ఓ కార్యనిర్వహణాధికారి, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవి శంకర్ కోరారు.




# పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ 15వ వార్షికోత్సవం

**మునగపాక, ఆగస్టు 26, జయ జయహే:**

మునగపాక మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో గల పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ 15వ వార్షికోత్సవం ఈ నెల 26 27 28 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు పి.ఆర్.నాయుడు, బొడ్డేడ సత్యనారాయణ తెలిపారు. గ్రంథాలయ వార్షికోత్సవ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన డిబేటు పోటీలు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించబడతాయని, ప్రవాస వాడ్రాపల్లి వారిచే ఉత్తమ విద్యార్థులకు అభినందన కార్యక్రమం, చివరి రోజున 29న దాడి జగన్నాధరావు రచించిన చీకటి బాట అనే నాటిక అనకాపల్లి వారిచే ప్రదర్శించబడుతుందని వారు తెలిపారు.

# కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

**మాడుగుల ఆగస్టు 26 జయ జయహే**

అపరిష్కృతంగా ఉన్న కాంట్రాక్టు పారామెడికల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని పారామెడికల్ సిబ్బంది కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం మాడుగుల సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద వారు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న తమను వెంటనే రెగ్యులర్ చేయాలని, రెగ్యులైజేషన్ పూర్తయ్యే వరకు కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నూరు శాతం గ్రాస్ వేతనం చెల్లించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగ కుటుంబానికి 50 లక్షలు పరిహారం అందించాలని, వారి కుటుంబంలో కాంట్రాక్టు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈపీఎఫ్ కల్పించాలని, అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు పూర్తి జీతంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని,వారి కుటుంబాలకు ఆరోగ్య కార్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. అలాగే ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులకు రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలు కల్పించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు మెడికల్ సిబ్బంది కే కుమారి,ఎన్ వరలక్ష్మి, జి రేవతి, సిహెచ్ లోవరాజు, ఎం తాతాజీ, కే కాంత లక్ష్మి, బి శివ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.




## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ సీఎం వి.నారాయణస్వామి.

**తిరుమల (జయ జయహే)**

శ్రీవారి దర్శనార్థం సుప్రభాత సేవ, తోమాల సేవల్లో పాల్గొనేందుకు కుటుంబ సమేతంగా తిరుమలకు విచ్చేసిన పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి వి.నారాయ-ణస్వామి ని శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ప్రముఖ న్యాయవాది వడకలూరు మస్తానయ్య ఘనంగా స్వాగతించి, శ్రీవారి దర్శనానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న నారాయణస్వామి , అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, పి ఆర్ ఓ భరత్, జయచంద్ర , నెల్లూరు జగదీష్ , విజయ భాస్కర్ యు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక గవరపాలెంలో సుంకరమెట్ట జంక్షన్ సమీపంలో గల బుధవారం సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవం అత్యంత వైభవంగా ఆలయ పాలకవర్గ సభ్యులు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సత్తమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని అక్కడ జరుగుతున్న జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదములు స్వీకరించి తరించడం జరిగింది వీరికి ఆలయ పాలకవర్గ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి ఆయనకు దుస్సాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన పాలకవర్గ సభ్యులతో భక్తులతో మాట్లాడుతూ గవరపాలెంలో ప్రతి సంవత్సరం అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ సత్యమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవం చుట్టుపక్కల ప్రజలకు ఆధ్యాత్మికంగా భక్తులకు కొలువైన నిలుస్తున్నదని అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఐశ్వర్యాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన ప్రార్థించారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## డోర్ టూ డోర్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి



**మాడుగుల ఆగస్టు 26 జయ జయహే**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డోర్ టు డోర్ ఇంటింట ప్రచారం కార్యక్రమం లో భాగంగా బుధవారం మాడుగుల మాజీ ఎమ్మెల్యే గదిరెడ్డి రామానాయుడు మాడుగుల మండలంలో ఇంటింట ప్రకారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు రెండేళ్లు నమ్మకం పేరుతో ఇంటి ఇంటికి ప్రచార కార్యక్రమం మాడుగుల మండలం సత్యవరం గ్రామం లో ఇంటింటికి తిరిగి రెండేళ్ల అభివృద్ధిపై కరపత్రాలు అందజేశారు.ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించిన అనంతరం మై టీడీపీ యాప్ లో అప్డేట్ చేశారు. ఈ కార్యక్రమం లో యూనిట్ ఇంచార్జి సూర్యనారాయణ, బూత్ ఇంచార్జి కేశవ, బోర రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈద్ మిలాద్ ఉన్ నబి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**మాడుగుల ఆగస్టు 26 జయ జయహే**

ముస్లిం సోదరులు బుధవారం భక్తిశ్రద్ధలతో ఈద్ మిలాద్ - ఉన్ - నబీ ఉత్సవంనిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే బండా సత్యనారాయణ మూర్తి హాజరై మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. మసీదు కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు, కూటమి నాయకులు అద్దెపల్లి జగ్గారావు, ఎన్ సన్యాసిరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, దశీగేటి సూర్యారావు, పి జగన్నాధరావు, షేక్ మస్తాన్, పి నానాజీ, కొట్నాల త్రినాధరావు మరువాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు





## చోడవరంలో ఘనంగా మదర్ తెరిసా జన్మదిన వేడుకలు

**చోడవరం ఆగస్టు 26 జయ జయహే**

చోడవరం దుడ్డువీధి శ్రీ నూకంబిక కళ్యాణం మండపంలో బుధవారం మదర్ తెరిసా జయంతి వేడుకలు ఘనగన నిర్వహించారు. అనకాపల్లి జిల్లామాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా మదర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సమాఖ్య మాజీ జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కండెల్లి వెంకట్రావు మాట్లాడుతూ అల్బేనియా దేశంలో పుట్టి భారత దేశంలో కలకత్తా మురికివాడల్లో ఎంతో మందికి సేవలు అందించారని ఎన్నో అనాధ శరణాలయాలను ఏర్పాటు చేశారని అన్నారు. కుష్టి వ్యాధిగ్రస్తులకు ఎనలేని సేవలు అందించారన్నారు. భారత్ ప్రభుత్వం తన సేవలకు గుర్తింపుగా భారతరత్న కూడా ఇచ్చారన్నారు. మదర్ తెరిసా ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు.మాదిగ ఉద్యోగుల సమైక్య మాజీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్త శ్రీనివాసరావు, మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా కమిటీ సభ్యులు కంటిపాము దేవుడు బాబు, మేస్త్రి బండారు నాయుడు మహిళలు పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఈనెల 31న చోడవరంలో మెగా జాబ్ మేళా

**చోడవరం ఆగస్టు 26 జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 31న మెగా జాబ్ మేళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. "దక్కన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్" వారి ప్రొడక్షన్ డిపార్ట్మెంట్ కంపెనీలో (వాకిన్) ఇంటర్వ్యూస్ కొరకు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ చదివిన విద్యార్థులను ఉద్యోగముల కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కాబట్టి చోడవరం, మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రసాయన విభాగ హెచ్ ఓ డి డాక్టర్ అనురాధ, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, శ్రీ వెంకటేష్, ఐక్యూ ఏసీ సమన్వయకర్త డాక్టర్ రాజేశ్వరరావు తెలియజేశారు. అభ్యర్థులు లేటెస్ట్ రెస్యూమ్,ఎడ్యుకేషనల్ డాక్యుమెంట్స్, అనుభవం ఉంటే వారి పే స్లిప్స్,ఆధార్ కార్డు జిరాక్స్ వారి వెంట తీసుకుని రావాలన్నారు. మరిన్ని వివరాల కు అధ్యాపకుడు శ్రీ వెంకటేష్ 8712707778 సంప్రదించవలసిందిగా తెలియజేశారు.



## చోడవరంలో స్వచ్ఛ పదం

**చోడవరం ఆగస్టు 26 జయ జయ హే**

చోడవరం పట్టణంలో స్వచ్ఛ పదం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట దెబ్బల ఏరియాలో పేరుకుపోయిన తుప్పలు డొంకలను కార్యదర్శి గంగాధర్ రావు పర్యవేక్షణలో తొలగించారు. అలాగే అక్కడ కాలవలో పేరుకుపోయిన సిల్టు ను తొలగించారు. ఈ సందర్భంగా అక్కడున్న ప్రజలకు తడి చెత్త,పొడి చెత్త కార్యక్రమంపై అవగాహన కల్పించి స్పెషల్ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తీసిన సిల్ట్ అంతా కూడా ట్రాక్టర్ ద్వారా దూరంగా తరలించారు. ప్రతి బుధవారం ఒక స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కండక్ట్ చేసి చోడవరం పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ పదంలో ముందుకు తీసుకు వెళ్తున్నామనీ, ప్రజలు సహకరించాలని ఈవో కోరారు.

# స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా వైసిపి క్యాడర్ పనిచేయాలి

## మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

**మునగపాక, ఆగస్టు 26, జయ జయహే:**

వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో వైసీపీ జెండా ఎగిరే విధంగా కార్యకర్తలు పనిచేయాలని వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ కార్యకర్తలకు సూచించారు. మునగపాక మండల వైసీపీ అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చయనాయుడు అధ్యక్షతన బుధవారం మునగపాక బొడ్డేడ ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో వైసీపీ కార్యకర్తల మండల సమావేశం జరిగింది. అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో వైసిపి చాలా బలంగా ఉ ందని, అన్ని పంచాయతీల్లో ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకుందని, అయితే ప్రజలలో ఉన్న కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత దృష్ట్యా మండలంలో దాదాపుగా అన్ని స్థానాలు వైసిపి దక్కించుకోవడం ఖాయం అని, కార్యకర్తలు జాగ్రత్తతో వ్యవహరించి అధికారి కూటమి పార్టీ ఎత్తుగడలను తిప్పి కొట్టాలని ప్రసాదు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, శంకర్, ఆడారి కాశి బాబు, షేక్ ఇస్మాయిల్, బొడ్డెడ శ్రీను, బీసీటీ గంగప్పలనాయుడు, మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, మాజీ సర్పంచ్ దిమ్మల అప్పారావు పాల్గొన్నారు.





# సత్తెమ్మ తల్లికి నూకాంబిక దేవస్థానం నుంచి సారే సమర్పణ

**అనకాపల్లి జయ జయహే**

ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవం అయిన అనకాపల్లి గవరపాలెం వెలసి ఉన్న శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం పాలకవర్గ సభ్యులు దేవస్థానం సిబ్బంది ఇక్కడ సమీపంలో గల సత్తెమ్మ తల్లి అమ్మవారికి బుధవారం జాతర పురస్కరించుకొని నోకాంబికా దేవస్థానం పాలకవర్గ సభ్యులు దేవస్థానం నుంచి ఆనవాయితీగా వస్తున్న సారే పట్టణంలో సన్నాయి వాద్యాల మేళతాళాలతో ఊరేగింపుగా సత్తెమ్మ తల్లికి పట్టుచీర గాజులు కుంకుమ పసుపు , పువ్వులు వివిధ రకాలఫ్రూట్స్, వివిధ రకాల స్వీట్స్ సారే సమర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో నూకాంబిక దేవస్థానం చైర్మన్ పి నాగ శ్రీను గొల్ల బాబు ఆలయ ఈవో ఏళ్ళ శ్రీధర్ పాలకవర్గ సభ్యులు సూరే సతీష్ దాడి రవికుమార్ కొడుకుల శ్రీకాంత్ ఎం శంకర్రావు పి స్వాతి ఆనంద్ కే రాజారావు ఎం జానకి శ్రీనివాసరావు వి మంగ కె సూర్యలక్ష్మి పైడ్రాజు వై సంతోషి కుమారి నగేష్ తదితరులు పాల్గొన్నారు




# పల్లె పల్లెలో బహుజన్ సమాజ్ పార్టీ కార్యక్రమం

**అరకులోయ: ఆగస్టు 26 .జయ జయహే**

పల్లె పల్లె బహుజన్ సమాజ్ పార్టీ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు శెట్టి లక్ష్మీనారాయణ. ఎస్ పోతురాజు ప్రధాన కార్యదర్శి గన్నేల పంచాయతీ పొలంగూడ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఉన్న త్రాగు నీటి డ్రైనేజీ పివిటిజి గిరిజనులకు ఇప్పటివరకు పిఎం జన్మన్ పక్క గృహాల బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం వారు కాల మాపన చేస్తున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# మదర్ తెరిసా ఆదర్శనీయులు

**అమరావతి,ఆగస్టు 26 జయ జయహే**

కరుణ, సేవ, ప్రేమకు ప్రత్యేకంగా నిలిచిన మద్దతు తెలుసా ప్రతి ఒక్కరికి ఆదర్శనీయులని ఆమె అడుగుజాడల్లో అందరూ నడవాలని జన చైతన్య సమితి మహిళా కోఆర్డినేటర్ షేక్ జుబేదా ఖాతూన్ అన్నారు. అమరావతిలోని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రంలో బుధవారం మదర్ తెరిసా 116వ జయంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరుణ నిస్వార్ధ సేవకు మారుపేరుగా నిలిచిన మదర్ తెరిసాను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మానవత్వమే నిజమైన మతం అని తన జీవితంలో చూపించిన మదర్ తెరిసా సేవలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ముందుగా మదర్ తెరిసా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కూరపాటి రాజ్యలక్ష్మి ,పఠాన్ పర్వీన్, షేక్ కరీనా,పఠాన్ కరిష్మా, జనామాల కుమారి,షేక్ నగీన తదితరులు పాల్గొన్నారు.



# ఇంటిట ప్రచారంలో ప్రజలు బ్రహ్మ రధం

## తెదేపా టౌన్ అధ్యక్షుడు కిషోర్ హర్షం

**జంగారెడ్డిగూడెం-జయ జయహే**

కూటమి పాలన రెండేళ్ల నమ్మకం సుపరిపాలనలో సూపర్ సిక్స్ పేరుతో అందించిన పథకాలను వివరిస్తూతెలుగు దేశం నాయకులు బుధవారం డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించగా ప్రజల్లో విశేషం గా స్పందన లభించిందని నాయకులు తెలిపారు. ఎన్.టి.ఆర్ సామాజిక ఫెంక్షన్స్, తల్లికి వందనం,ఏడాదికి 3 గ్యాస్ బండలు ఉచితం,అన్నదాత సుఖీభవ,వాహన మిత్ర ఇలా అనేక పథకాలు అందుతున్నందుక సంతోషం వ్యక్తం పరిచారన్నారు .ఈ సందర్బంగా పట్టణ తెదేపా అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్లుగా, పేదలకు అండగా నిలిచే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని,త్వరలో రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీలను 29వార్డుల్లో విజయకేతనం ఎగురవేసి జంగారెడ్డిగూడెం పట్టణ అభివృద్ధికి సహకటించాలని కోరారు... జిల్లా అధికార ప్రతినిధి బొబ్బర రాజ్ పాల్,గెడా సుబ్రహ్మణ్యం,యూనిట్ ఇంచార్జ్ బొబ్బర సాయి చంద్, మేడికొండ శ్రీను,బొమ్మి సత్యనారాయణ, మహిళలు , నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# యువ ఇంజనీర్లు దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావాలి

## ఉత్పత్తి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయి

## ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు హితవు

**టెక్కలి ఆగస్టు 26 జయ జయహే**

దేశంలో సాంకేతిక పరిజ్ఞానంతో యువ ఇంజనీర్లు దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావాలని ఉత్పత్తి రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు హితవు పలికారు. టెక్కలి సమీపంలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని 10 వ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 300 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు పట్టాలు, బంగారు పథకాలు గవర్నర్ కంభంపాటి హరిబాబు ప్రధానం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్తమ ఫలితాలను సాధించి దేశ ప్రగతికి నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంధనం సౌర విద్యుత్తు అభివృద్ధి లో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయన్నారు, జీవితంలో నైతిక విలువలు క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం తో సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాల పై దృష్టి సారించాలని విద్యార్థులకు గవర్నర్ హరిబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కే సోమేశ్వరరావు, కార్యదర్శి ఎల్ ఎల్ నాయుడు, కోశాధికారి డి నాగరాజు, డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ రవికుమార్, మధు కుమార్, నాగ శేషు, అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.





# ఏఎస్ఐ గంగాధరరావు ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు అవగాహన

**ఉండ్రాజవరం:**

తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సారథ్యంలో, నిడదవోలు సీఐ తిలక్ పర్యవేక్షణలో ఉండ్రాజవరం ఎస్సై రవి కుమార్ , శక్తి టీమ్ ఏఎస్ఐ గంగాధరరావు ఆధ్వర్యంలో సుమారు 100 మంది మహిళా ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శక్తి యాప్, 112 అత్యవసర సేవలు, సైబర్ నేరాలు, ఓటీపీలు, అనుమానాస్పద లింకులు, ఫొటో మార్ఫింగ్, ఆన్‌లైన్ రుణ మోసాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు.చిన్నారుల భద్రత, బాల్యవివాహాలు, పోక్సో చట్టం, గంజాయి, మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని, సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

# ఏపీ టీ డబ్ల్యూ పాఠశాల విద్యార్థుల తరలింపు

## సుజాత సాల్మన్ ఆగ్రహం

**అరకులోయ: ఆగస్టు 26. జయ జయహే.**

విశాఖపట్నం ఏపీ టీ డబ్ల్యూ మరికవలస పాఠశాలను బలవంతంగా మార్చడన్ని వ్యతిరేకిస్తూ గిరిజన ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులు పలుగిరిజన సంఘాలు ప్రతిపక్ష పార్టీలు చేపడుతున్న నిరాసనాలు ధర్నాలపై ప్రభుత్వం స్పందించకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని సామాజిక కార్యకర్త ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ అన్నారు. మంగళవారం రాత్రి హడావిడిగా విద్యార్థులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారంటూ కొంతమంది విద్యార్థుల తల్లితండ్రులు తన దృష్టికి తీసుకురావడంతో మధురవాడాలో నీ పాఠశాలను సుజాత సల్మాన్ సందర్శించారు. అక్కడ గంటల తరబడి తిండి త్రాగునీరు సరైన సమాచారం లేకుండా తమ పిల్లల కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలను పరిశీలించిన సుజాత సల్మాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే గదిలో 50 మందికి పైగా విద్యార్థులను ఉంచడం సరైన ఫ్యాన్లు బెడ్లు లేకుండా గచ్చు పై విద్యార్థులు పడుకునే పరిస్థితి కల్పించడం అత్యంత దారుణామని ఆమె మండిపడ్డారు. సరైన వసతి భద్రత ఏర్పాటు చేయకుండా విద్యార్థులను తరలించడం బాధ్యత రహి త్యామని విమర్శించారు. ముఖ్యంగా బాలికల పాఠశాల వసతి ప్రాంగణంలో 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బాలురను ఉంచడం సిగ్గుచేటని విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దస్తావేజు లేఖరుల నూతన కార్యవర్గం ఎన్నిక

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా దస్తావేజులేఖర్ల సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం కొత్తూరు శారద నగర్ నందుగల శ్రీనివాస ఫంక్షన్ హాల్ నందు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు అనకాపల్లి దస్తావేజు లేఖలు సంక్షేమ సంఘం అధ్యక్షులు అయోధ్య శేషు ఆనంద ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ నూతన కమిటీఎన్నికలు సాఫీగా జరిగాయి ఆంధ్రప్రదేశ్ దస్తావేజులగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గా పెనుమాక వెంకట సుబ్బారావు రాష్ట్ర కార్యదర్శిగా గాదే రవికుమార్ రాష్ట్ర కోశాధికారిగా అవ్వారు సత్యనారాయణ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మల్యాల సీతాపతి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ బిఎస్సి సుబ్బారావు ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ సభను జయప్రదం చేయడం జరిగింది నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షులుగా సున్నం చిదంబర స్వామి అధ్యక్షులుగా వడ్డాది రమేష్ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు వెంకట గున్నాజీరావు ఉపాధ్యక్షులుగా డీఎస్సీ జెఎన్ మురళీకృష్ణ సహాయ కార్యదర్శి నరం సన్యాసినాయుడు కోశాధికారిగా కోశాధికారిగా ఆర్లే ఉమామహేశ్వరరావు ఆర్గనైజింగ్ సెక్రటరీగా శేఖర్ మంత్రి శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులుగా కోటి గణేష్ సూదికొండ మాణిక్యాలరావు బమ్మిడిపాటి వరప్రసాద్ జూ రెడ్డి శ్రీరామమూర్తి బొబ్బిలి సన్యాసిరావు గాలి నాయుడు బట్ట చంద్రశేఖర్ కోరుకొండ శ్రీనివాస్ కోసిరెడ్డి కృష్ణమూర్తి రంగాలే నరసింగరావు ఆరే సత్యవాణి బద్ధపు బాబురావు బత్తుల శ్రీనివాసరావు శానాపతి రాము వీరంతా నూతన కార్యవర్గ ఎన్నిక కాబడినారు ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పరిధిలోని దస్తా లేఖరులు పాల్గొనడం జరిగింది



# కళాభారతిలో అపూర్వ సంగీత సమ్మేళనం






**విశాఖపట్నం, ఆగష్టు 26, జయ జయహే :**

మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బుధవారం జరిగిన వయోలిన్ ద్వయం కచేరీ సంగీత ప్రియులను ఉర్రూతలూగించింది. 55 ఏళ్ల సంగీత ప్రస్థానం, 40 ఏళ్ల సాంస్కృతిక వారసత్వం ఒకే వేదికపై కలిసిన అపూర్వ సంగీతానికి కళాభారతి వేదికైంది. విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతి తన 40 ఏళ్ల విజయవంతమైన సాంస్కృతిక ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఘనమైన వయోలిన్ ద్వయం కచేరీని నిర్వహించింది. మైసూర్ మ్యూజికల్ ప్రిన్స్, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డా. మైసూర్ మంజునాథ్, ఆయన కుమారుడు విద్వాన్ సుమంత్ మంజునాథ్ తమ వయోలిన్ వాదనతో సంగీతాభిమానులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సంగీత సాయంత్రానికి మరో ప్రత్యేకతగా, ఐదవ తరం మృదంగ విద్వాంసుడు, సంగీత కళాభారతి మృదంగ రత్న విద్వాన్ డా. వంకాయల వెంకట రమణమూర్తి తన 55 ఏళ్ల సంగీత ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం అబ్బురపరచింది. డా. మంజునాథ్ విద్వాన్ సుమంత్ మంజునాథ్ల వయోలిన్ సంవాదానికి డా. వెంకట రమణమూర్తి, సంగీత మణి విద్వాన్ బి. పురుషోత్తం మృదంగ సహకారం అందించి లయ సౌందర్యాన్ని మరింతగా పెంచారు. స్వరం, లయం, అనుభవం, యువ ప్రతిభల సమ్మేళనంగా కచేరీ అలరించింది. కళాభారతి నాలుగు దశాబ్దాల సాంస్కృతిక సేవ, డా. వెంకట రమణమూర్తి 55 ఏళ్ల సంగీత సాధన ఒకే సందర్భంలో కలవడంతో ఈ కార్యక్రమం తరతరాలకు భారతీయ శాస్త్రీయ సంగీత వారసత్వం కొనసాగుతున్న తీరుకు చిరస్మరణీయ ప్రతీకగా నిలిచింది.

# గ్యాస్ ఎంత ఉందో చూసుకునే కాంపోజిట్ గ్యాస్ సిలిండర్ ఆవిష్కరణ

## 10 కేజీల హెచ్‌పీ నవ్య కాంపొజిట్ గ్యాస్ సిలండర్ విడుదల

**విశాఖపట్నం, ఆగష్టు 26, జయ జయహే :**

హెచ్‌పిసీఎల్ గ్యాస్ కంపెనీ నూతన సాంకేతికతతో రూపొందించిన 10 కేజీల కాంపోజిట్ సిలిండర్ 'హెచ్‌పి నవ్య' ను బుధవారం కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. శివాజీపాలెం రఘురాం గ్యాస్ ఏజన్సీ వద్ద హెచ్‌పీసీఎల్ రిఫైనరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్ త్రివేది, ఎల్.పి.జి. చీఫ్ జనరల్ మేనేజర్ దేబేష్ పురోహిత్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మహేందర్ సింగ్‌లు హెచ్‌పీ నవ్యను మార్కెట్‌లో లాంఛనంగా ప్రవేశపెట్టారు. అనంతరం సేల్స్ ఆఫీసర్ ప్రతాప్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆశీష్ సింఘాల్‌లు మాట్లాడుతూ వినియోగదారులకు మరింత భద్రతతో పాటు సులభమైన వినియోగాన్ని అందించడమే లక్ష్యంగా ఈ ఆధునిక సిలిండర్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టినట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. సాంప్రదాయ ఇనుప సిలిండర్లతో పోలిస్తే ఈ కొత్త కాంపోజిట్ సిలిండర్ అత్యంత తేలికగా ఉండటమే కాకుండా అనేక ఆధునిక వసతులను కలిగి ఉందన్నారు. ఇది పారదర్శకంగా ఉండటం వల్ల సిలిండర్‌లో గ్యాస్ ఎంత ప్రమాణంలో ఉందో బయటి నుంచే వినియోగదారులు స్పష్టంగా చూసి తెలుసుకునే వెసులుబాటు వుందన్నారు. దీని వలన రీఫిల్ బుకింగ్ సమయాన్ని ముందుగానే అంచనా వేయడానికి వీలవుతుందని తెలిపారు. అంతేకాకుండా ఫైబర్ గ్లాస్ మెటీరియల్‌తో రూపుదిద్దుకోవడం వల్ల తుప్పు పట్టే సమస్య ఉండదన్నారు. ప్రమాదాల బారిన పడకుండా అత్యున్నత భద్రతా ప్రమాణాలతో పేలుడు సంభవించని రీతిలో దీనిని రూపొందించారని వివరించారు.



**- కాంపోజిట్ గ్యాస్ సిలండర్ల బుకింగ్ ఇలా..**

పాత ఇనుప సిలిండర్లు వాడుతున్న వినియోగదారులు స్వల్ప అదనపు డిపాజిట్ చెల్లించి, ఈ నూతన 'హెచ్‌పి నవ్య' సిలిండర్‌కు సులభంగా మార్చుకోవచ్చని ఏజెన్సీ ప్రతినిధులు పేర్కొన్నారు. కొత్త గ్యాస్ కనెక్షన్ పొందాలనుకునే వారు కూడా ఈ తేలికపాటి సిలిండర్‌ను ఎంచుకోవచ్చని తెలిపారు. నగర ప్రజలు నూతనంగా ప్రవేశ పెట్టిన కాంపొజిట్ 10 కిలోల సిలండర్లను వినియోగించుకోవాలని కోరారు. వినియోగదారులకు సత్వర సేవలు అందించడంలో డిస్ట్రిబ్యూటర్లు మరియు సిబ్బంది చూపుతున్న నిబద్ధతను ఈ సందర్భంగా అధికారులు అభినందించారు. వినియోగదారుల సంతృప్తి మరియు సురక్షిత గ్యాస్ వినియోగమే లక్ష్యంగా ముందుకు సాగుతామని రఘురాం గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం ప్రకటించింది.

# సంఘసేవకు ప్రతిరూపం మదర్ తెరీసా...!

## టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు

**భీమిలి (జయ జయహే)**



మధర్ తెరీసా 116వ జయంతిని పురస్కరించుకొని ఆదర్స్ హిందీ ప్రేమిమండలి భీమిలి శాఖ అధ్యక్షులు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాస్టర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంటా నూకరాజు విచ్చేసి తెరీసా నిలువెత్తు విగ్రహానికి ఇరువురు సమక్షంలో పూలమాలలు వేసి ఘనంగా నివాలులర్పించారు. భీమిలి బీచ్ పార్క్ వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గంటా నూకరాజు మాట్లాడుతూ మధర్ తెరీసా చిన్నప్పటినుండి మతపరమైన సేవా కార్యక్రమాలపై ఆసక్తిగా ఉండేవారని అన్నారు. 18 ఏళ్ల వయస్సులోనే ఇంటర్నేషనల్ లోరెటో సిస్టర్స్ అనే సన్యాసుల సంఘంలో చేరి పూర్తిస్తాయి మానవతా సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. భారతదేశంలో ఉండే పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో కలకత్తాలో ఉన్న సెయింట్ మేరీ స్కూల్లో ఉపాధ్యాయురాలుగా చేరి సేవలకు శ్రీకారం చుట్టారని అన్నారు. కుష్టురోగులు, అనాధలు, పేదలు మరియు మరణిస్తున్న వారికి మిషనరీస్ ఆఫ్ చారిటీ అనే సంస్థ ద్వారా సేవలు అందించి ప్రపంచ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు విస్తరింప చేశారని అన్నారు. పేదల సేవలో ఆమె చేసిన నిస్వార్ధ సేవలకు 1979వ సంవత్సరంలో నోబెల్ శాంతి బహుమతి ద్వారా గుర్తింపబడ్డారని అన్నారు. అదేవిదంగా భారత పౌరుసత్వం తీసుకొని ఇక్కడ ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకు భారతదేశం ఆమెను అత్యున్నత పౌర పురష్కారం అయిన భారతరత్నతో గౌరవించిందని గంటా నూకరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

# వైభవంగా సంస్కృత సప్తాహం

**విశాఖపట్నం, ఆగష్టు 26, జయ జయహే :**

కేంద్రీయ సంస్కృత విద్యాపీఠం, ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ వారి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సంస్కృత సప్తాహం ద్వారకానగర్ బీవీకే కళాశాల భువన విజయం సభా ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యా కేంద్ర పాలక మండలి అధ్యక్షులు ఆచార్య జి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్కృత భారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు దోర్భల ప్రభాకర శర్మ ముఖ్య అతిథిగా హాజరై సంస్కృత భాష యొక్క ప్రాశస్త్యం వివరిస్తూనే సంస్కృతం మన మాతృభాష అనే పాటద్వారా విద్యార్థులను చైతన్య పరిచారు. కార్యక్రమం సంయోజకులు డా.పి.టి.జి.వి.రంగాచార్యులు, మరిదింటి నరసింహాచార్యులు, తెలుగు సంస్కృత అకాడమీ యోజనను వివరించారు. తెలుగు సంస్కృత అకాడమీ తరఫున ఆంధ్ర



విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు జి.అక్కుభొట్ల శర్మ, శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత సంస్కృత అధ్యాపకులు, ప్రధానాచార్యులైన డా. టి.పి.శ్రీనివాస రామానుజం, కేంద్రీయ విద్యాలయం విశ్రాంత సంస్కృత అధ్యాపకులు ఎస్ ఎస్ ఎన్ మూర్తి తదితరులను ఘనంగా



సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కృత భారతి అధ్యక్షులు పెరుమాళ్ళు, బీవీకే కళాశాల కరస్పాండెంట్ ఆచార్య కందర్ప విశ్వనాథ్, పి.వి. రాధారాణి అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో సమన్వయకర్త బి వి కె కళాశాల విశ్రాంత సంస్కృత అధ్యాపకులు డా.పిళ్ళా వెంకట రమణమూర్తి అతిథులుగా పాల్గొన్న వారిని వేదిక పైకి ఆహ్వానం పలికి, సన్మానితులను సభకు పరిచయం చేసారు. పేరాల హరిప్రియ కార్యక్రమ నిర్వహణ విధి విధానాలు తెలిపి, వందన సమర్పణ చేశారు.

# సంచార జాతుల స్వతంత్ర దినోత్సవ వేడుకను విజయవంతం చేయండి: పెండ్ర వీరన్న

**పశ్చిమగోదావరి జిల్లా (జయ జయహే)**



నరసాపురంలో. సంచార జాతుల సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు. ఆ పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు. ఆ పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్. ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న ఒక ప్రకటన విడుదల చేశారు. 74వ విముక్తి సంచారజాతుల స్వతంత్ర దినోత్సవ వేడుక కార్యక్రమాన్ని ఈనెల 31 సోమవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల్లో ఉన్న సంచార జాతుల సంఘ నాయకులు కార్యకర్తలు యువకులు ఈ సభకు హాజరు అవ్వాలని పెండ్ర వీరన్న పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో సంచార జాతులకు కార్పొరేషన్ పాలకమండలి నియమించి 12 మంది డైరెక్టర్లను నియమించడం జరిగిందని అలాగే గుర్తింపు లేనటువంటి కొన్ని కులాలను గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే విధంగా ఆనాటి ప్రభుత్వం చర్యలు తీసుకుందని. అలాగే ఐదు సంవత్సరాల వ్యవధిలో సంచార జాతుల వారికి సంక్షేమ పథకాలు రూపేనా నాలుగు లక్షల మందికి గాను 1300 కోట్ల రూపాయలు పైబడి లబ్ధి చేకూరిందని. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం స్థానిక సంస్థల్లో సంచార జాతులకు ఐదు శాతం రిజర్వేషన్ ఇస్తానని. దేవాలయాల్లో పాలక మండల సభ్యులుగా అవకాశం కల్పిస్తామని. ఈ కులాల వారికి 200 యూనిట్లు విద్యుత్తు రాయితీ కల్పిస్తామని. కో ఆప్షన్ సభ్యులుగా కూడా అవకాశం కల్పిస్తామని. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి నేటికీ కూడా ఈ జాతులకి కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇవ్వక పోగా ఇచ్చినటువంటి హామీలను ఒక్కడు కూడా నెరవేర్చినటువంటి దాఖలాలు లేవని ఆయన అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు కూడా గమనించి ఈ జాతుల అభివృద్ధి కోసం పోరాటం చేయవలసిన అవసరం ఆసన్నమైందని ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్ర వీరన్న అన్నారు చెప్పి అవకాశం కల్పిస్తామని జరిగింది, ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా సంచారజాతుల సంఘం నాయకులు కార్యకర్తలు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు



# వ్యాసరచన పోటీలలో డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ

**చోడవరం ఆగష్టు 26 జయ జయహ**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎల్ఐసి ఆఫ్ ఇండియా సంస్థ వారు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో చోడవరం కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్,ఎల్ఐసి ప్రతినిధులు అప్పారావు ఈశ్వరరావు ఇతర సిబ్బంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మొదటి స్థానం రమేష్ బీఎస్సీ కెమిస్ట్రీ, ద్వితీయ స్థానం భవాని కంప్యూటర్స్, తృతీయ స్థానం ఉప్పల ఇతర విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ బహుమతులు ప్రధాన చేశారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డి మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సమన్వయకర్త డాక్టర్ రాజేశ్వరరావు, అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ మల్లిబాబు, డాక్టర్ అనురాధ, డాక్టర్ లక్ష్మీమంగమ్మ, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాజకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



# సెప్టెంబర్ 2న చండీ హోమం మరియు ధార్మిక సంస్థల సమ్మేళనం

**డోన్ (జయజయహే)**

డోన్ పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు సెప్టెంబర్ 2న ఉదయం 9-00 గంటల నుండి విశ్వ శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రముఖ యాజ్ఞికులు బ్రహ్మశ్రీ సోమయాజులు నేతృత్వంలో చండీహోమం, ధార్మిక సంస్థల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు పాతాళం సుబ్బారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్యానరు, కరపత్రాలను డోన్ పట్టణంలోని వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షులు శ్రీశ్రీశ్రీ ఆచార్య పరమాత్మానందగిరి స్వామీజీ, శ్రీశ్రీశ్రీ విరజానందస్వామీజీలతో పాటు వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, ఆశ్రమా పీఠాధిపతులు, సనాతన హిందూ ధార్మిక జాగృతిని కలిగించేలా ధార్మిక పరిరక్షణకు పునరంకితమయ్యేలా ప్రేరణాత్మక ఉపన్యాసాలను, అనుగ్రహ భాషణాలను చేస్తారని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ సన్నాహక కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు సందు రమణ, కృష్ణారావు, తిమ్మారెడ్డి, ఒ. కిరణ్, శ్రీరామ్, శ్రీ వివేకానంద సేవాసమతి వ్యవస్థాపక అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి జొన్నగడ్డ శ్రీనివాసులు శెట్టి, సలహా సభ్యులు సర్వజ్ఞ మూర్తి, తిరుమల తిరుపతి దేవస్థానములు జిల్లా ధర్మ ప్రచార మండలి సభ్యులు శ్రీనివాసులు, డాక్టర్ సురేశ్ బాబు, శ్రీకృష్ణ భగవద్గీత పరివార్ కార్యదర్శి ఎల్కూరి నరేష్, గీతా యోగాసన సంఘం గురువు శ్రీ రాం పుల్లయ్య, రామకృష్ణ, రోటరీ క్లబ్ ఆఫ్ డోన్ అధ్యక్షులు గంగిరెడ్డి మరియు వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో



## పచ్చి కొబ్బరిని వాడితే.. బ్యూటీ పార్లర్‌కు వెళ్లాల్సిన అవసరమే ఉండదు

కొబ్బరితో ఎన్నో రకాల రుచికరమైన వంటలను తయారుచేసుకోవచ్చు. ఎక్కువగా ఇది దక్షిణ భారతదేశంలో వాడుతుంటారు. ప్రతీ వంటకాల్లోను కొబ్బరిని ఉపయోగిస్తుంటారు. అందువల్ల అక్కడ ప్రతీ ఒక్కరు అందంగాను, యవ్వనంగాను కనిపిస్తుంటారు. అయితే కొబ్బరిని సాధారణంగా అయితే కొబ్బరి చట్నీ, సాంబార్, కొబ్బరి అన్నం, కొబ్బరి స్వీట్ వంటి రకరకాల పదార్థాలను తయారుచేసుకుని ఆస్వాదిస్తుంటారు అని మాత్రమే తెలుసు. అంతేకాదు కొబ్బరిని పొడిగా చేసుకుని ప్రతీ వంటల్లోను ఉపయోగిస్తే ఎంతో రుచికరమైన ఆహారాన్ని తినవచ్చు.
అయితే పచ్చి కొబ్బరితో ఆరోగ్యానికి పుష్కలమైన ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంతో పాటు చర్మ సౌందర్యాన్ని కూడా కాపాడుకోవచ్చని కూడా అంటున్నారు. కొబ్బరిలో ఫైబర్, విటమిన్ సి, ఈ, బి, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, మినరల్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మాత్రమే కాదు చర్మ సౌందర్యాన్ని కూడా రక్షిస్తాయి.
పచ్చి కొబ్బరి జీవక్రియను కూడా మెరుగుపరుస్తుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యలను కూడా దూరం చేస్తుంది. కొబ్బరిలో ఉండే విటమిన్లు, మినరల్స్ జుట్టును ఆరోగ్యంగా ఉంచడంతో పాటు చర్మాన్ని కూడా యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. ముఖ్యంగా వయసు మీద పడుతున్న వారికి ఇది ఓ అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. చర్మంపై ముడతలు, మచ్చలు వంటి వాటిని తొలగించేందుకు తోడ్పడుతుంది. కొబ్బరిలో పుష్కలమైన విటమిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు వంటి ఉండడం వల్ల ఇవి బరువును తగ్గించుకోవడానికి కూడా సహాయడపతాయి. అందువల్ల తరచూ కొబ్బరిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఆకలిని తగ్గించి బరువు నియంత్రిస్తుంది. అధిక కేలరీలు తీసుకోవడం వంటి వాటిని కూడా నిరోధిస్తుంది.
కొబ్బరి కేవలం చర్మ సౌందర్యానికి మాత్రమే కాకుండా అనారోగ్య సమస్యలకు కూడా ఎంతగానో సహాయపడుతుంది. అందులో ముఖ్యంగా ప్రస్తుతం ఎదుర్కుంటున్న గుండె సమస్యలకు అద్భుతంగా పనిచేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెంచి, చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది. పచ్చి కొబ్బరిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉండడం వల్ల రోగనిరోధక వ్యవస్థలను బలపరుస్తుంది. అంతేకాదు ఇందులో ఉండే కాల్షియం, పొటాషియం ఎముకలను బలోపేతం చేసేందుకు సహాయపడతాయి.

# పచ్చిపాలతో మీ అందం రెట్టింపు

### ఈ నేచురల్ మిల్క్ ఫేస్ ప్యాక్స్ ట్రై చేయండి



పాలు ఆరోగ్యానికి ఎంత మంచిదో మనందరికి తెలుసు.. కానీ పాలతో చర్మ సౌందర్యాన్ని పెంచుకోవచ్చని మీకు తెలుసా?
అవును పాలతో కలిపి ఈ ఫేస్ ప్యాక్‌లు ట్రై చేశారంటే అందం రెట్టింపు అవుతుంది. పాలలోని సహజ గుణాలు ముఖంపై మురికిని, మృతుకణాలను తొలగిస్తుంది. పాలు చర్మాన్ని హైడ్రేట్ చేసి తేమగా ఉండేలా చేస్తుంది. పాలలో అనేక రకాల విటమిన్లు, పోషకాలు, లాక్టిక్ యాసిడ్ వంచి గుణాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి చర్మాన్నిపునరుజ్జీవింప చేస్తాయి. మీరు పాటించే స్కిన్ కేర్ రొటీన్‌లో పాలను కూడా ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. పచ్చి పాలను ముఖానికి వాడినట్లైతే చర్మం కాంతివంతంగా మెరుస్తుంది. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా పచ్చిపాలతో ఈ పదార్థాలను కలిపి ఫేస్ ప్యాక్ ట్రై చేశారంటే మీ చర్మం మిల మిల మెరిసిపోవడం ఖాయం.

**పచ్చి పాలు, బాదం పప్పు ఫేస్ ప్యాక్**
ముందుగా బాదం పప్పును రాత్రంతా నానబెట్టండి. ఆ తర్వాత పచ్చి పాలలో బాదం పప్పులు వేసి మెత్తగా పేస్ట్ చేయండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లై చేయండి. 10 నిమిషాల తర్వాత ముఖాన్ని సాధారణ నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే ముఖం కాంతివంతంగా మారుతుంది. ఇలా చేయడం వల్ల ముఖంపై మచ్చలు, మొటమలు తగ్గిపోతాయి. చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడతాయి.

**పచ్చి పాలు, తేనె ఫేస్ ప్యాక్**
పచ్చి పాలల్లో తేనె కలిపి ముఖానికి అప్లై చేయండి. 10-15 నిమిషాల తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా ప్రతిరోజు చేస్తే చర్మం బిగుతుగా మారుతుంది. మృతుకణాలు తొలగిపోతాయి. ముఖంపై మచ్చలు, ముడతలు తగ్గిపోయి కాంతివంతంగా మెరుస్తుంది.



**పచ్చిపాలు, పసుపు ఫేస్ ప్యాక్**
పచ్చి పాలల్లో చిటెకెడు పసుపు వేసి ముఖానికి అప్లై చేయండి. 5-10 నిమిషాల తర్వాత సాధారణ నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోండి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే మీ ముఖం కాంతివంతంగా మెరుస్తుంది. పసుపులో ఉండే యాంటీ బయాటిక్స్ చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

**పాలు, అవకాడో ఫేస్ ప్యాక్**
మూడు టేబుల్ స్పూన్ పాలల్లో అవకాడో గుజ్జును కలిపి మెత్తగా పేస్ట్ చేయాలి. ఆ మిశ్రమాన్నిముఖానికి, మెడకు అప్లై చేయాలి. అరగంట తర్వాత సాధారణ నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

**పాలు, బొప్పాయి ఫేస్ ప్యాక్**
బొప్పాయి గుజ్జులో రెండు చేబుల్ స్పూన్ పాలు, టీ స్పూన్ తేనె కలిపి రాత్రి పడుకునే ముందు ముఖానికి అప్లై చేయండి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే ముఖం కాంతివంతంగా మెరుస్తుంది.

# చికెన్ వింగ్స్.. ఇంట్లోనే సులువుగా చేసుకోవచ్చు



**చికెన్ వింగ్స్ పేరు చెబితేనే నోరూరిపోతుంది. దాన్ని తినాలంటే ప్రతిసారి రెస్టారెంట్ కి వెళ్లాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే చాలా సులువుగా చేసుకోవచ్చు. కాస్త ఓపిక ఉంటే చాలు చికెన్ వింగ్స్ గంటలో రెడీ అయిపోతాయి. ఇవి ఇంట్లో ఉన్న పిల్లలకు, పెద్దలకు కూడా ఇది బాగా నచ్చుతాయి. ఎలా చేయాలో తెలుసుకోండి.**

**చికెన్ వింగ్స్ రెసిపీకే కావలసిన పదార్థాలు**

చికెన్ వింగ్స్ - అరకిలో
మైదాపిండి - అరకప్పు
కారం - ఒక స్పూను
మిరియాల పొడి - అర స్పూను
ఉల్లిపాయ పొడి - ఒక స్పూను
వెల్లుల్లి పొడి - ఒక స్పూను
నూనె - వేయించడానికి సరిపడా
ఉప్పు - రుచికి సరిపడా
బటర్ - రెండు స్పూన్లు
సోయాసాస్ - ఒక స్పూన్
బ్రౌన్ షుగర్ - మూడు స్పూన్లు
వెల్లుల్లి తురుము - ఒక స్పూను
అల్లం తురుము - ఒక స్పూను
తేనె - ఒక స్పూన్
పచ్చిమిర్చి - రెండు
ఎండుమిర్చి - రెండు
నువ్వులు - ఒక స్పూను
సోయాసాస్ - రెండు స్పూన్లు

**చికెన్ వింగ్స్ రెసిపీ**

చికెన్ వింగ్స్ ను తెచ్చి శుభ్రంగా కడిగి తడి లేకుండా టిష్యూ పేపర్ మీద ఆరబెట్టాలి.

ఒక గిన్నెలో మైదా, కారం, ఉప్పు, పచ్చిమిర్చి తరుగు, వెల్లుల్లి తరుగు, ఉల్లిపాయల పొడి వేసి బాగా కలిపి చికెన్ వింగ్స్ ను కూడా వేయాలి.

ఆ మిశ్రమం చికెన్ వింగ్స్‌కు బాగా పట్టేలా ఒక అరగంట పాటు పక్కన పెట్టేయాలి.

ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి.

చికెన్ వింగ్స్ అందులో వేసి వేయించి తీసి టిష్యూ పేపర్ మీద వేసుకోవాలి.

ఇప్పుడు ఒక కళాయిని స్టవ్ మీద పెట్టి చిన్న మంట పెట్టాలి. 7. దానిలో బటర్ వేయాలి. ఆ బటర్ లో అల్లం వెల్లుల్లి తురుమును వేయాలి.

అలాగే సోయాసాస్, తేనే, బ్రౌన్ షుగర్ కూడా వేసి కలుపుకోవాలి.

సాస్ కొద్దిగా చిక్కగా అయ్యాక పెద్ద మంట పెట్టి ముందుగా వేయించి తీసుకున్న చికెన్ వింగ్స్ ను వేసి టాస్ చేసుకోవాలి.

చివర్లో ఎండుమిర్చి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి కలుపుకోవాలి.

నువ్వులు గింజలను చల్లుకోవాలి. అంతే టేస్టీ చికెన్ వింగ్స్ రెడీ అయినట్టే. ఇది నోరూరించేలా ఉంటాయి.

ఇంట్లో పిల్లలకు పెద్దలకు అందరికీ నచ్చుతాయి

చికెన్ వింగ్స్ బయట ఎక్కువ రేటు ఉండే అవకాశం ఉంది. అదే ఇంట్లో చేసుకుంటే చాలా తక్కువ ధరకే ఇవి రెడీ అయిపోతాయి. ముందుగానే చికెన్ షాప్ వాడికి వింగ్స్ ను వేరుగా చేసి పెట్టమని ఆర్డర్ ఇచ్చుకోవాలి. లేదా ఆన్లైన్ చికెన్ మార్కెట్లలో కూడా చికెన్ వింగ్స్ సపరేట్ గా దొరుకుతున్నాయి. వాటిని కొనుక్కున్నా సరిపోతుంది. టేస్టీ చికెన్ వింగ్స్ వండేసుకోవచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com